

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 06 | సంచిక 139 | ఎడిటర్ : బరిగెల శివ | బుధవారం 16, ఏప్రిల్ 2025 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# మంత్రి పదవుల కోసం గాబరపాటు





మళ్లీ మొదలైన మంత్రి పదవుల కుమ్ములాటలు

ప్రజా పాలనకు తలవంపులు తెస్తున్న కాంగ్రెస్ నాయకులు

రంగంలోకి దిగి కోపం వ్యక్తం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

కష్టపడే వాళ్ళకు పార్టీలో తప్పకుండా గుర్తింపు లభిస్తుంది

సీఎం పదవి ఊరికే రాలేదు తెగించి కొట్లాడి తెచ్చుకున్నాను

ప్రజాసేవ కోసం ప్రాణాలను కూడా లెక్కచేయవద్దు

ప్రజలకు సేవ చేయడం మానేసి పదవుల కోసం పాకలాడకండి

ప్రతిపక్షాల కుట్రలని తిప్పి కొట్టడంలో ఒక్క నాయకుడు పనిచేయడం లేదు

కాంగ్రెస్ నాయకుల చిత్తశుద్ధి తగ్గిపోతుంది

మాట్లాడితే పదవులు కావాలంటున్నారు ప్రజల గోడు పట్టించుకోరా!

ఒంటరిగా పోరాడుతున్న సీఎంను చూసి సిగ్గు తెచ్చుకోండి

సమర్థవంతమైన పాలనకు తలవంపులు తేకండి

డాక్టర్ బరిగెల శివ

**డాక్టర్ బరిగెల శివ**
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

**హైదరాబాద్( జై భీమ్ డెస్క్)**

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేస్తామంటూ కారు కూతలు కూస్తున్న చిల్లర నాయకులకు దీటైన సమాధానం చెప్పే దిశగా కాంగ్రెస్ నాయకులు సడ్డమాలుతున్నారని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా విమర్శించారు. ఆస్తమానం పదవుల కోసమే ఆరట పడుతున్నారు తప్ప సోషల్ మీడియాలో కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతున్న విషపూరితమైన వ్యతిరేక చర్యలను తిప్పికొట్టడంలో దీటుగా నిలబడలేకపోతున్నారని మందలించారు. ఏ ప్రభుత్వమైనా ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రత్యక్ష రాజకీయ ఎన్నికలకు వెళ్లడం జరుగుతుందని అలాంటిది కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి 16 నెలలు అవుతుండగా ప్రభుత్వం కూలిపోతుందంటూ గాలి మాటలతో రెచ్చిపోయే నాయకులు దినదినానికి ఎక్కువ అవుతున్నారన్నారు. ప్రతి ఒక్కడు సీఎంను టార్గెట్ చేసి మాట్లాడుతున్నారే తప్ప ప్రజలకు సేవ చేయటం లేదంటూ ప్రజాసేవకు అడ్డుపుల్లలు వేయడంలో ఆరితేరిపోతున్నరన్నారు. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా తీసుకొని చూస్తుండగా దేశవ్యాప్తంగా ఎక్కడ లేని విధంగా హైదరాబాదులో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ సిద్ధ సిద్ధపరచుకోవడం విశేషం అన్నారు. హెచ్ సియూ పరిధిలోని సర్వే నెంబర్ 25 ప్రభుత్వ భూమి అని తెలిసినప్పటికీ ప్రతిపక్షాలు ఊహకందని కుట్రలు పన్నుతూ విద్యార్థులను రెచ్చగొట్టి నానా రాద్ధాంతం చేయించారన్నారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఎంపీ రఘునందన్ రావు 1974లో అప్పటి ప్రభుత్వం భూమిని విశ్వవిద్యాలయ నిర్మాణం కొరకు (అక్వైర్ ) స్వాధీనం చేసిందని చెప్పగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫారెస్ట్ చెట్లు నరుకుతున్నారని ఏకంగా తప్పుడు సంకేతాన్ని ఇవ్వడం చూస్తుంటే బిజెపికి చెందిన రాష్ట్ర నాయకులకు జాతీయ అధినాయకత్వానికి పొంతన లేని సంభాషణలు కొనసాగుతున్నాతన్నారు. ఇప్పటికే విద్యార్థులపై పోలీసు అధికారులు పెట్టిన కేసులు

- మిగతా 2లో..

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు



మంత్రివర్గ విస్తరణ అధిష్టానం పరిధిలో ఉంది

సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

హైదరాబాద్ వీడి గ్రామాలకు తరలి వెళ్లాల్సిందే

సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి

విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

పార్టీ ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ సూచన

2

# అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం

మే 2న రానున్న ప్రధాని మోడీ

మంత్రులు పనితీరు మార్చుకోవాల్సిందే

కేబినేట్ భేటీ తరవాత మంత్రులతో చంద్రబాబు

2



# ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో ఆర్థిక వ్యవస్థ పురోగతి

ఇతర నగరాలకన్నా హైదరాబాద్‌లో 56శాతం వృద్ధిరేటు

సిటిజన్‌గ్లోబల్ కేపబిలిటీసెంటర్ ప్రారంభోత్సవంలో శ్రీధర్ బాబు

**హైదరాబాద్,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):**

గ్లోబల్ బిజినెస్ హబ్‌గా హైదరాబాద్ మారిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇక్కడ కమర్షియల్ స్పేస్‌కు డిమాండ్ బాగా పెరిగిందని చెప్పారు. అమెరికాకు చెందిన సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఆధ్వర్యంలో సిటిజన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంత్రి ప్రారంభించిన సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడారు. ఢిల్లీ, చెన్నైలాంటి మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో 56 శాతం వృద్ధి రేటు ఉంది. ఈ క్రమంలో తెలంగాణ దేశంలో 1 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేందుకు చేస్తున్న ప్రయత్నానికి దోహదపడుతుందని మంత్రి అన్నారు. ప్రస్తుతం బలమైన ప్రభుత్వ ప్రైవేటు- భాగస్వామ్యంతో తెలంగాణ ఆర్థిక వ్యవస్థ వేగంగా ముందుకు సాగుతోందని ఆయన వెల్లడించారు. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్‌ను సంస్థలు లీజుకు తీసుకున్నాయి. ఆమ్జెన్, గ్లోబల్ లాజిక్, ఎలీ లిల్లీ,

- మిగతా 2లో..



జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# మంత్రి పదవుల కోసం.. గాబరపాటు

మొదటి పేజీ తరువాయి

అన్నిటిని ఉపసంహరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల పట్ల చిత్తశుద్ధిని ప్రదర్శించిందన్నారు. ఇదంతా ఒకే త్రైతే 10 సంవత్సరాల తర్వాత అన్ని విశ్వవిద్యాలయాలలో ప్రభుత్వ విద్యను బలపరచడం కోసం, బలోపేతం చేయడం కోసం విద్యాశాఖ మంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులతో నిరంతరం ప్రయాస పడుతూ, కష్టపడుతూ విద్యా ప్రమాణాలను అభివృద్ధి చేయడం కోసం ఆరాటపడుతుంటే కేవలం ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసి ఆచార్య కుమార్ మినహా అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు సీఎంకు మచ్చ తెచ్చే విధంగా తమాషాలు ఆడుతున్నారన్నారు. కేవలం అధికార పదవులను అడ్డం పెట్టుకొని చిల్లర రాజకీయాలకు పాల్పడే వాళ్లను వెనకేసుకొస్తూ ఉద్యమాలు, నిరసనలు, ధర్నాలు నిర్వహించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం వైపు రెచ్చగొడుతున్నారన్నారు. ప్రభుత్వాన్ని భదునం చేసే విధంగా వీసీలు కూడా ప్రయత్నాలు చేస్తుండడం ఊహించలేని మోసమన్నారు.ప్రధానంగా మంత్రి పదవుల గోల మళ్లీ మొదటికి వచ్చి మంత్రి పదవులు నాకంటే నాకంటూ కాంగ్రెస్ శాసనసభ్యులు ఒకరి మీద ఒకరు కారాలుమీరాలు రుద్దుకోవడం ప్రజా పాలనకు తలవంపుగా మారుతుందన్నారు. ప్రజా సేవకు కట్టుబడి,కష్టపడి పని చేయాల్సిన నాయకులు దానిని పక్కనపెట్టి మంత్రి పదవుల కోసం దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్నారన్నారు. పనికిమాలిన రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి నేరుగా రంగంలోనికి దిగి కాంగ్రెస్ శాసనసభ్యులకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారన్నారు. మంత్రి పదవుల సంగతి అధిష్టానం చూసుకుంటుందని అందులో ఎవ్వరు ఇన్వాల్వ్ అవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజలకు బాధ్యతాయుతమైన పరిపాలనను అందించుట కొరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పినట్లుగా గుర్తుకు చేశారు. అడ్డమైన ఆస్తులు సంపాదించి వ్యాపారాలు చేసుకుంటూ మంత్రి పదవులు కావాలంటే ప్రజలు చీదరించుకుంటారన్న సంగతి మర్చిపోవద్దన్నారు. ఎవరి గోల వారిదే అయితే పార్టీ పరువుకు నష్టం వాటిల్లుతుందని గుర్తించాలన్నారు. నాయకులారా ప్రభుత్వం చేయుచున్న మంచి పనుల్ని ఇకనైనా ప్రజల్లోనికి తీసుకెళ్లండి అంటూ హితవుపలికారు. మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ నాయకులు కోవర్టు లాగా మారి కన్నతల్లి లాంటి పార్టీని ఇబ్బందులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సరైన సమయంలో మంత్రి పదవులు అధిష్టానం నియమిస్తుందని అప్పటివరకు ఎవరైనా వేచి ఉండాల్సిందే అంటూ.... కాంగ్రెస్ ప్రభుత్వానికి ,ప్రజాపాలనకు నాయకులందరూ సహకరిస్తూ సరైన రీతిగా ప్రజల మధ్యలో ఉండి ఊహించిన ఫలితాలకు మించి ప్రజాసేవను చేయాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేయడం వల్ల తనకు పెద్దగా ఒరిగేది ఏమీ లేదని స్పష్టం చేశారు. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా అన్ని పార్టీల్లో నాయకులు ఒక్కన్నీ టార్గెట్ చేసి అణిచివేయాలని ప్రయత్నం చేస్తుంటే ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మంత్రి శ్రీధర్ బాబు మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి మంత్రి దామోదర రాజనర్సింహలు అహర్నిశలు ప్రభుత్వం పరువు కోసం ప్రయాస పడుతున్నారన్నారు. నాయకులారా ప్రజా సేవ కోసం వ్యాపారాలను పక్కన పెట్టండి అంటూ హితవుపలికారు. ఎన్నో సంక్షేమ పథకాలను నెరవేరుస్తామని ప్రజలకు హామీ ఇచ్చి ఒక్కొక్కటిగా అభివృద్ధి చేసుకుంటూ ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రి పదవులు ఆశించి బంగపడుతున్న సంపన్నమైన ఆస్తి కలిగిన వ్యాపారస్తులైన శాసనసభ్యులు మంత్రి పదవుల కోసం ఢిల్లీ వైరవీలను కూడా చేయడానికి వెనకాడడం లేదన్నారు. సీనియర్ జూనియర్ అనే తారతమ్య భేదం లేకుండా ఎవరైతే ప్రజల మధ్యలో పనులు చేస్తూ ప్రజల కోసం నిలబడుతూ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగాం నిలబడుతూ ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొడుతూ ప్రజా పాలనకు దీటైన సేవలను అందిస్తారో వాళ్లకే మంత్రి పదవులు దక్కే ఆస్కారం ఉంటుందన్నారు. కొంతమంది నాయకులను నియోజకవర్గ ప్రజలు అట్టి నాయకులు ఉన్నారని కూడా గుర్తించడం లేదన్నారు. అదే నాయకుల తలవంపుల పనుల వల్ల ప్రజా పాలన ప్రభుత్వానికి వ్యతిరేక పేరు వస్తుందన్నారు. ప్రభుత్వం తరపున నాయకులు మంత్రి పదవుల కోసం కుమ్ములాడుకుంటుంటే ప్రతిపక్షానికి చెందిన నాయకులు నవ్వులాడుతున్నారని విమర్శించారు. పదవులు ఉన్నా ఒకటే లేకున్నా ఒకటే అనుకునే స్వభావంతో ఆయా నియోజకవర్గాల ప్రజలకు తగిన రీతిలో సేవలందించాలని శాసనసభ్యులకు గుర్తుకు చేశారు. క్రమశిక్షణ కలిగిన కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవిస్తూ నాయకులుగా ఎదుగుతూ సొంత పార్టీని విమర్శించే చిల్లర స్థాయికి రాజకీయాలు దిగజారుతున్నాయన్నారు. అలాంటి నాయకులు కాంగ్రెస్ పార్టీకి భారం అన్నారు. సొంత నాయకులై కాంగ్రెస్ పార్టీని నోటికి వచ్చినట్లు దూషిస్తూ విమర్శిస్తుంటే కాలం పట్టి నాయకులకు కచ్చితంగా బుద్ధి చెబుతుందన్నారు.

**మంత్రి పదవుల గోల మామూలుగా లేదు..**

మంత్రి పదవుల కోసం కాంగ్రెస్ పార్టీలో మళ్లీ మొదలైన కుమ్ములాటలు. మంగళవారం ఉదయం 11 గంటలకు శంషాబాద్ నోవాటెల్ హెూటల్లో రేవంత్ రెడ్డి అధ్యక్షతన సీఎల్పీ అత్యవసర భేటీ. భేటీకి హాజరు కానున్న మంత్రులు, విప్‌లు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు. మంత్రి వర్గ విస్తరణ విషయంలో తనకు మంత్రి పదవి రాకుండా జానారెడ్డి అడ్డుకున్నాడు అంటూ రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు వ్యాఖ్యలు. హెలికాప్టర్ లేకుండా నల్గొండ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి బైట అడుగుపెట్టట్లేదు అంటూ మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యలు. మంత్రి పదవి రాకుంటే రాజీనామా చేస్తానన్న మల్ రెడ్డి రంగారెడ్డి వ్యాఖ్యలపై సీఎల్పీ మీటింగ్‌లో చర్చించనున్న సీఎం రేవంత్ రెడ్డి. సమయానుకూలంగా మంత్రి పదవులు వస్తాయంటూ దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రజా అనిచవేతను దీటుగా ఎదుర్కొనే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఐక్యతను, క్రమశిక్షణను కనబరచాలని సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి సూచించినట్లు విశ్వాసనీయ సమాచారం. భారత రాజ్యాంగం పట్ల జరుగుతున్న ప్రత్యక్ష, పరోక్ష కుట్రలను యావత్ తెలంగాణ ప్రజలు గుర్తించాలని ప్రతి ఒక్కరు రాజ్యాంగ రక్షణ కోసం అండగా నిలవాలని తెలిపినట్లు సమాచారం. అన్నిటికీ తెగించి ఉన్నానని పదవుల కోసం ఆరాటపడే అవసరం తనకు ఎంత మాత్రం లేదని సమావేశంలో తెలిపినట్లు చర్చకు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రజల మెప్పుకోసం ప్రజలకు బాగోగు కోసం ప్రజాక్షేత్రంలో ప్రజల విశ్వాసాన్ని కూడా పెట్టుకోవడం కోసం ఎంతటి సాహసాల కైనా తెగించక తప్పదని తెలుపుతూ పార్టీ పరువుకు భంగం కలిగించే నాయకులను ఉద్దేశించి హెచ్చరించినట్లు సమాచారం.

# పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదు

**మంత్రివర్గ విస్తరణ అధిష్టానం పరిధిలో ఉంది**
**సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి**
**హైదరాబాద్ వీడి గ్రామాలకు తరలి వెళ్లాల్సిందే**
**సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండండి**
**విపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి**
**పార్టీ ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ సూచన**

**హైదరాబాద్,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):**

రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేస్తున్న వ్యాఖ్యలు దుమారం రేపుతున్న వేళ...ఎమ్మెల్యేలకు సిఎం రేవంత్ రెడ్డి సున్నితంగా హెచ్చరిక చేశారు. ఎవ్వరు కూడా లైన్ దాటి మాట్లాడవద్దని అన్నారు. మంత్రివర్గ విస్తరణ అన్నది అదిష్టానం నిర్ణయమని కూడా స్పష్టం చేశారు. శంషాబాద్ నోవాటెల్ హోటల్‌లో జరిగిన కాంగ్రెస్ శాసనభాపక్ష సమావేశంలో సిఎం రేవంత్ మాట్లాడారు. తనకు మంత్రి పదవి రాకుండా జానా రెడ్డి అడ్డుకుంటున్నారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రచ్చ చేస్తే.. పదేళ్లు పార్టీని కాపాడుకున్న మమ్మల్ని కాదని.. వేరే పార్టీలు తిరిగొచ్చిన వారికి పదవులు ఇస్తారా అని ప్రేమ్‌సాగర్ రావు పరోక్షంగా ప్రభుత్వానికే వార్నింగ్ ఇచ్చారు. ఇలా ఒక్కొక్కరుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తుండటంపై సీఎం రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు హెచ్చరికలు చేశారు. మంత్రి పదవులను అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. పార్టీ గీత దాటితే ఊరుకునేది లేదని ఎమ్మెల్యేలను హెచ్చరించారు. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారని అన్నారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ అని చెప్పారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానందే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. మంత్రివర్గ విస్తరణపై ఎవరేం మాట్లాడినా ఉపయోగం లేదని అన్నారు. మీరు మాట్లాడేదంతా రికార్డవుతుందని హెచ్చరించారు.అలాగే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎవరూ సోషల్‌మీడియా వాడటం లేదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వంపై నెగిటివ్ ప్రచారం చేస్తుంటే.. ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కే పరిమితమవుతున్నారని అన్నారు. వీకెండ్ రాజకీయాలు చేయొద్దని సూచించారు. రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. పలువురు ఎమ్మెల్యేలను హెచ్చరించినట్లు తెలుస్తోంది. పార్టీకి ఇబ్బంది కలిగిస్తే నేతలే ఇబ్బందులు ఎదుర్కొంటారు. పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడితే లాభం కంటే నష్టమే ఎక్కువ. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్. దీనిపై ఎవరేం మాట్లాడినా ఉప యోగం లేదని సీఎం తేల్చి చెప్పారు. మంత్రి పదవులపై ఒకరికి మించి మరొకరు లీకులు ఇస్తున్నారని అసహనం వ్యక్తం చేసిన సీఎం.. ఇష్టం వచ్చినట్లు- మాట్లాడితే మంత్రి పదవులు రావన్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు జాగ్రత్తగా పని చేసుకోవాలని సూచించారు. కాగా, మంత్రి వర్గ విస్తరణపై కొందరు ఆశావహులు బహిరంగంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఏకంగా హుకుం జారీ చేశారు. మరోవైపు.. మంత్రి పదవి విషయంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. ఇలా మంత్రి వర్గ విస్తరణపై ఆశవహులు బహిరంగంగ మాట్లా తుండటంతోనే తాజాగా జరిగిన సీఎల్పీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డి వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ నేతలకు దిశా నిర్దేశర చేశారు. ఎమ్మెల్యేలు ప్రతి గ్రామంలో పర్యటించేలా కార్యాచరణ చేపట్టాలన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు గ్రామాల్లో పర్యటించాలి. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకమవుతా. ప్రతిపక్షాల ప్రచారాన్ని నమ్మి.. బుల్డోజర్లు పంపిస్తున్నారని ప్రధాని మాట్లాడుతున్నారు. భాజపా, భారాస కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయి. పార్టీ, ప్రభుత్వ ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. తెలంగాణ మోడల్‌పై దేశంలో చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌ను ఇబ్బంది పెట్టాలనే భాజపా, భారాస ఒక్కటయ్యాయి. సన్నబియ్యం మన పథకం.. మన పేటెంట్, మన బ్రాండ్. భాజపా పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం ఎందుకు ఇవ్వట్లేదో చెప్పాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ సమావేశంలో మంత్రులు భట్టి విక్రమార్క,పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం, పిసిస చీఫ్ మహేశ్కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా తెలంగాణ

మొదటి పేజీ తరువాయి

మారియట్, సిగ్నాలాంటి అంతర్జాతీయ సంస్థలు నగరానికి వచ్చాయి. ఏడాది వ్యవధిలో 70కి పైగా గ్లోబల్ కేపబులిటీ సెంటర్‌లు ఏర్పాటయ్యాయి. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటు-ంది. పెట్టు-బడులు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం. అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయి. ప్రభుత్వంపై నమ్మకంతో పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారని శ్రీధర్‌బాబు అన్నారు. అమెరికాకు చెందిన ఫైనాన్షియల్ సేవల దిగ్గజం సిటిజన్ ఫైనాన్షియల్ గ్రూప్ తాజాగా హైదరాబాదులో టెక్ కంపెనీ కాగ్నిజెంట్ తో జతకట్టి తన గ్లోబల్ కెపాసిటీ సెంటర్ ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాదులోని కాగ్నిజెంట్ క్యాంపస్ లోపలే ఉంటుందని కంపెనీ పేర్కొంది. వాస్తవానికి ఇదొక ఇన్నోవేషన్ హబ్ మాదిరిగా వర్క్ చేస్తుందని కంపెనీ వెల్లడించింది. ఈ జీసీసీ ఏర్పాటు- ద్వారా మార్చి 2026 నాటికి కొత్తగా 1000 హై వ్యాల్యూ కలిగిన ఉపాధి అవకాశాలు కల్పించబడతాయని వెల్లడించాయి. ఈ సెంటర్ బ్యాంకింగ్ సంస్థలకు రానున్న కాలంలో థర్డ్ పార్టీ సంస్థలపై ఆధారపడటాన్ని తగ్గిస్తుందని జీసీసీ పేర్కొంది. హైదరాబాద్‌లో దాదాపు 57,000 మంది సిబ్బందిని కలిగి ఉన్న కాగ్నిజెంట్, దాని ప్లాట్‌ఫారమ్‌లైన న్యూరో, ఎ÷-లోసోర్స్‌లను ఉపయోగించి సిటిజన్స్ జీసీసీకి అదనపు శక్తిని ఇవ్వనుంది. అలాగే క్లౌడ్, డేటా, సైబర్ సెక్యూరిటీ-, ఇంటెలిజెంట్ ఆటోమేషన్ రంగాల్లో భవిష్యత్తు అవసరాలకు తగిన ఉత్పత్తులను కంపెనీ అందించనుంది. అమెరికా చెందిన సిటిజన్స్ సంస్థ, కాగ్నిజెంట్ చేతులు కలపటంపై తెలంగాణ ఐటీ మంత్రి శ్రీధర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం హైదరాబాద్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ రంగంలో ఆవిష్కరణలకు ప్రపంచ ప్రధాన కార్యాలయంగా మారిందని కాగ్నిజెంట్ ప్రతినిధి నాగేశ్వర్ చెరుకుపల్లి అన్నారు. పైగా అనేక జీసీసీల ఏర్పాటుకు హైదరాబాద్ డెస్టినేషన్ గా మారింది. ప్రస్తుతం హైదరాబాదులో అత్యుత్తమ టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటమే ప్రపంచ దేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలను ఆకట్టుకోవటానికి కారణంగా నిపుణులు చెబుతున్నారు.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం : మద్దిశెట్టి సామ్యేల్



**హైదరాబాద్ జై భీమ్ న్యూస్:**

తెలుగు రాష్ట్రాల్లో పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా ప్రపంచ సాంస్కృతిక పర్యావరణ పరిరక్షిణ కమిషన్ కృషి చేస్తుంది. దానిలో భాగంగానే స్టేట్ కోఆర్డినేటర్లను నియమించడం జరుగుతుంది.మంగళవారం ప్రధాన మంత్రి చేపట్టిన సూర్య ఘర్ యోజన పథకం సభ్యులు మంగళవారం మద్దిశెట్టి సామ్యేల్ ని సంప్రదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆదినారాయణ, సుజాత, రాజా, గోపి రాజు తదితరులు పాల్గొన్నారు.

## అటకెక్కిన మొక్కల పెంపకం

**ఎక్కడా కానరాని నర్సరీల హడావిడి**
**సామాజిక అడవుల బాధ్యతను విస్మరించిన మంత్రి**

**నిజామాబాద్,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):**

తెలంగాణలో చేపట్టిన హరితహారం మంచి ఫలితాలు ఇచ్చింది. అయితే అందులో మంచిచెడులను విశ్లేషించి ముందుకు సాగాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దగా ఎక్కడా ఆ కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వడం లేదు. మొక్కలను నాటాలని సోషల్ ఫారెస్ట్, ఈజీఎస్ శాఖల అధికారులు దృఢనిశ్చయంతో గతంలో పనిచేశారు. కోతులు వాపస్ పోవాలన్న కెసిఆర్ నినాదాం కూడా బాఆనే పనిచేసింది. కానీ ఇప్పుడు అలా జరగడం లేదు. మానవజాతి మనుడగకు చెట్లు సజీవసాక్ష్యం. వృక్షాలు అంతరించడం వల్లనే సరైన వర్షాలు కురువడం లేదని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమానికి అంకురార్పణ చేశారు. వరుణ దేవుడు కరుణించడంతో చాలాచోట్ల నాటిన మొక్కలు జీవం పోసుకున్నాయి. అయితే ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఇది నిరంతరాయంగా కొనసాగాలి. దీనికి పెద్దపీట వేయాలి. హరితహారాన్ని ఒక మహోత్తర ఉద్యమంగా ముందుకు తీసుకెళ్ళాలని కెసిఆర్ సన్నాహాలు చేసారు. మొక్కలు నాటించి ఈజీఎస్ కూలీల ద్వారా నాటిన మొక్కల చుట్టూ రక్షణ కంచెలు సైతం ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేసారు. గత హరితహారంలో పాఠశాల, ప్రభుత్వ దవాఖాన, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో నాటిన మొక్కలకు ప్రతిరోజు నీరుపట్టేలా ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో వివిధ శాఖల ఆధ్వర్యంలో పండ్లు, పూలు, అటవీ, మిశ్రమ జాతి మొక్కలతో ఇతర మొక్కల పెంపకాన్ని చేపట్టింది. వన విభాగం కింద ఒకటి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో నర్సరీలను నెలకొల్పి మొక్కల పెంపకం చేపట్టారు. ఈ నర్సరీల్లో పండ్ల విభాగంలో జామ, ఉసిరి, నిమ్మ, బొప్పాయి, కర్జూరా, ఫ్లవరింగ్, సాధారణ మొక్కలు కానుగ, చింత, నీలగిరి, కుంకుడు, వెదురు, వంటి మొక్కలు పెంచారు. నర్సరీలో ఉన్న మొక్కలకు నీరుపట్టి బతికించేందుకు సంబంధిత అధికారులు చొరవ తీసుకుంటూ, ఆయా నర్సరీ బాధ్యులకు ఎప్పటి కప్పుడు సూచనలు ఇస్తూ, వాటిని సందర్శిస్తూ, మొక్కల ఎదుగుదల తీరును పరిశీలించారు. వర్షాకాలం ప్రారంభం కాగానే జూలైలో కార్యక్రమం ప్రారంభం అయ్యేది. కానీ అటవీశాఖ మంత్రిగా కొండా సురేఖ అడవుల రక్షణ పెంపకంపై ఎక్కడా శ్రద్ద పెట్టడం లేదు. నిరంతరాయంగా మొక్కలు పెంచే విధంగా కార్యాచారణ చేయడం లేదు. దీంతో మొక్కల పెంపకం అటకెక్కింది.

## అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమం

**మే 2న రానున్న ప్రధాని మోడీ**
**మంత్రులు పనితీరు మార్చుకోవాల్సిందే**
**కేబినేట్ భేటీ తరవాత మంత్రులతో చంద్రబాబు**

**అమరావతి,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్) :**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అమరావతి పునఃనిర్మాణంపై పరత్యేక దృష్టిసారించింది.. ఇప్పటికే పలు రకాల పనులకు సీఆర్డీఏ అథారిటీ, ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాయి.. అయితే, గతంలో అమరావతి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోడీ.. ఇప్పుడు, అమరావతి పునఃనిర్మాణానికి కూడా రాబోతున్నారు.. మే 2వ తేదీన అమరావతిలో ప్రధాని నరేంద్రమోడీ పర్యటన కొనసాగనుంది.. అమరావతి పునర్నిర్మాణ పనుల్లో భాగంగా మోడీ పర్యటన ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు మంత్రులకు తెలిపారు.. మూడేళ్లలో శాశ్వత సచివాలయం, అసెంబ్లీ , హైకోర్టు, రహదారులు పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్టు వివరించారు ఇంఛార్జ్ మంత్రుల పర్యటనల్లో మూడు పార్టీల నేతల భాగస్వామ్యం ఉండాలని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. రెవెన్యూ సంబంధిత అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.. రెవెన్యూ సమస్యల్లో పోలీసుల జోక్యం అంశాలను పరిష్కరించాలన్న సీఎం. సూర్యఘర్ పథకం అమలు మరింత వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు.. వచ్చే నెల 2వ తేదీన ఏపీకి ప్రధాని నరేంద్ర మోడీ వస్తారని ఈ సందర్భంగా మంత్రులకు వివరించారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. కాగా, కేబినెట్ భేటీ- ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కొన్ని విషయాల్లో ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాదా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.. తిరుపతిలో గోవుల మృతిపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారాన్ని తిప్ప కొట్టడంలో మంత్రులు వైఫల్యం చెందారని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా అమలు చేయలేని సంక్షేమ కార్యక్రమాలు మనం అమలు చేస్తుంటే.. ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు విఫలం అవుతున్నారని దుయ్యబట్టారు.. జిల్లాలు యూనిట్‌గా తీసుకొని పార్టీ.. ప్రభుత్వం.. మంత్రులు సమన్వయంతో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకుని వెళ్లాలన్నారు.. అంతేకాదు.. ఎన్నిసార్లు చెప్పినా మంత్రుల తీరిలో మార్పు రావడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు.. వ్యక్తిగత కార్యదర్శులు, వోఎస్‌డీలు చేస్తున్న తప్పులు ప్రభుత్వంపై పడుతున్నాయి.. వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించారు సీఎం చంద్రబాబు.

## ఎసిబి వలలో అర్బన్ బయోగైవర్సిటీ అధికారి

**హైదరాబాద్,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్) :**

ఎసిబికి మరో తిమింగలంచిక్కింది. లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. శేరిలింగంపల్లి జోనల్ మున్సిపల్ కార్యాలయంలో అర్బన్ బయోడైవర్సిటీ- డిప్యూటీ- డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న శ్రీనివాస్ ఏసీబీ వలకు చిక్కారు. రూ.70 వేలు లంచం తీసుకుంటూ పట్టు-బడ్డారు. శ్రీనివాస్.. చార్మినార్ జోన్ ఇన్‌ఛార్జిగా అదనపు బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో చాంద్రాయణగుట్ట సర్కిల్‌లో అర్బన్ బయో డైవర్సిటీ- వింగ్‌లో రూ. 45 లక్షల మొక్కల కాంట్రాక్ట్‌కు సంబంధించిన బిల్లులను క్లియర్ చేయడానికి కాంట్రాక్టర్ దగ్గర నుంచి శ్రీనివాస్ రూ.2,20,000 లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా రూ.70,000 లంచం తీసుకుంటు-ండగా ఆయన్ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టు-కున్నారు.

# సంపాదకీయం

## రష్యా బాటలోనే.. ట్రంప్ యుద్ధం !

ఉక్రెయిన్ యుద్ధం ఇంకా ముగియనే లేదు...ట్రంప్ రూపంలో మరో యుద్ధం మొదలయ్యింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడులతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. ఇది ఇంకా కొనసాగు తుండగానే గాజాపై ఇజ్రాయిల్ దాడులు కూడా ప్రభావం చూపాయి. ఇలా అంతర్జాతీయంగా జరుగుతున్న దాడుల కారణంగా ప్రపంచ మార్కెట్లు కుదుపునకు గురవుతున్నాయి. తాజాగా ట్రంప్ అమెరికా అధ్యక్షుడు కాగానే మరో రకమైన యుద్ధానికి తెరతీసారు. సుంకాలతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థపై దాడి మొదలు పెట్టారు. ఇది తమకూ వర్తిస్తుందని గుర్తించడం లేదు. అందుకే చైనా ధీటుగానే స్పందిస్తోంది. కొన్ని వస్తువులపై అమెరికాకు పోటీగా సుంకాలు విధించడంతో పాటు, మరికొన్న వస్తువులను అమెరికాకు సరఫరా చేయడం ఆపేసింది. ఉక్రెయిన్‌పై రష్యా దాడితో ఒక్క ఉక్రెయినే కాకుండా రష్యా కూడా కోలుకోలేని విధంగా దెబ్బతింది. అంతేగాకుండా యుద్ధానికి దిగితే విరమించుకోవడం అంత ఈజీ కాదని తెలిసి వచ్చింది. ఈవ్యవహారం సమసిపోక ముందే ఇప్పుడు ట్రంప్ తీరుతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనేక విధాలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. అంతకుమించి అమెరికాలో కూడా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతు న్నారు. రోడ్డెక్కి ధర్నలు చేస్తున్నారు. ట్రంప్ విధానాలను తూర్పారా బడుతున్నారు. అయినా ట్రంప్‌లో ఏ మాత్రం పశ్చాత్తాపం కనిపించడం లేదు. ప్రపంచ దేశాలు అన్నిటినీ ట్రంప్ వచ్చీరాగానే  ఆందోళనలో పడేశాడు. అమెరికాలో చదువుకుంటున్న వారిని, అక్కడికి వెళ్లి ఉంటున్న వారిలో సైతం కంటిమీద కునుకు లేకుండా చేశాడు. ప్రపంచ దేశాల ప్రజలు ట్రంప్ చర్యలు చూసి నవ్వుకుంటున్నారు. సకల దేశాలపై విధించిన సుంకాల వివరాలను ట్రంప్ ప్రకటించారు. కొన్ని దేశాల విషయంలో మాత్రం కొంత ఉదారతను చూపారు. నిరుద్యోగం భారీగా పెరగడం, ద్రవ్యోల్బణం కట్టడి చేయడం లక్ష్యంగా సమస్యలను తొలగిం చేందుకు ట్రంప్ సంకల్పించారు. అమెరికా మహా సంపన్న దేశం. మహాశక్తిమంతమైన దేశం. వైజ్ఞానిక, సాంకేతిక నవకల్పనలు అన్నీ ఆ దేశ ప్రతిభా ఫలాలే. ప్రపంచ అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు, ప్రయోగ శాలలు, ఉత్కృష్ట కంపెనీలు అమెరికా లోనే ఉన్నాయి. అమెరికా డాలర్ రిజర్వ్ కరెన్సీగా ప్రపంచ దేశాల ఆమోదం పొందింది. అమెరికా గ్రీన్ కార్డ్, అమెరికా పాస్‌పోర్ట్ ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఆకర్శిస్తోంది. ఉద్యోగం దొరికితే చాలు అక్కడే స్థిరపడి పోవాలనుకునే భారతీయులు ఎందరో. చైనా, ఇండియాతో సహా అనేక దేశాలు తమ విదేశ మారక ద్రవ్య నిల్వలలో అత్యధిక భాగాన్ని అమెరికా బాండ్ల రూపంలో భద్రపరచుకుంటున్నాయి. ప్రపంచంలో ద్రవ్యలోటు లేని ఏకైక దేశం అమెరికాయే గనుక ఆ దేశ బాండ్లు తమకు ఆర్థిక భద్రత సమకూరుస్తాయని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. దురదృష్ట వశాత్తు తమకు  ఎలాంటి లబ్ధిని సమకూర్చడం లేదని ట్రంప్‌ను గెలిపించిన అమెరికా  ప్రజలు భావిస్తున్నారు. ఆయన ఏ ఉద్దేశ్యంతో ఈ సుంకాల యుద్ధం మొదలు పెట్టారో కానీ...అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి గెలిచిన తరువాత డోనాల్డ్ ట్రంప్ నిర్ణయాలు, చర్యలు సంచలనం కలిగిస్తున్నాయి. వాటి పర్యవసానాలు సుదీర్ఘకాలం ప్రపంచాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయనున్నాయి. దేశదేశాల నుంచి ప్రతిభావంతుల వలసలు అమెరికాకు నిలిచిపోతాయన్న ఆందోళనలను ట్రంప్ పట్టించుకోవడం లేదు. సరుకుల వాణిజ్యానికి గణనీయమైన విఘాతం కలుగుతుంది. సరఫరా చైన్ ఒడిదుడుకులు ఎదుర్కొంటుంది. ట్రంప్ విధానాల పర్యవసానాలను ఎదుర్కోవడంలో చాలా సంపన్న దేశాలు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. ట్రంప్ ఏవో భ్రమలతో దబాయిస్తున్నారని అందరికీ అర్థమవుతుంది. అమెరికాలోకి దిగుమతి అవుతున్న సరుకులపై భారీ సుంకాలతో సంభవించే ధరల పెరుగుదలను అమెరికా ప్రజలు భరించలేరు. ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతుంది. లక్షలాది ప్రజలు ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదమున్నది. ట్రంప్ చర్యల కారణంగా అక్కడ ప్రస్తుతం నిత్యావసర వస్తువులు ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితులను అమెరికా ప్రజలు సహించరు. అమెరికా ఫస్ట్ నినాదాన్ని స్వాగతిస్తూనే ట్రంప్ తీరును ఎండగడుతున్నారు. అమెరికన్లు కూడా ద్రవ్యోల్బణం తాకిడికి తీవ్రంగా గురవుతారు. ఇప్పటికే అమెరికా వ్యాప్తంగా అన్ని పెద్ద నగరాలలోను వేలాదిగా ప్రజలు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత పెరిగినప్పుడు ఈ ఆందోళనలు మరింత తీవ్రం కాక తప్పవు. అమెరికా ప్రజల ఆగ్రహావేశాలకు ట్రంప్ ఎలా ప్రతిస్పందిస్తారన్నది తెలియాల్సి ఉంది. అనవసరంగా తేనెతుట్టెను కదిపిన ట్రంప్, తనకూ పుతిన్‌కు పెద్దగా తేడా లేదని నిరూపించుకున్నారు. ఆధునిక యుద్ధాలు ప్రజల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తాయని అనుభవంలోకి వచ్చింది. అమెరికా బాండ్లపై వడ్డీ రేట్ల తీరుతెన్నులను ఆయన తప్పక పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ట్రంప్ సుంకాల దెబ్బను కొన్ని దేశాలు తీవ్రంగానే ప్రతిఘటిస్తున్నాయి.  స్పందిస్తున్నాయి. ప్రతీకార సుంకాలను చైనా విధించింది. నీ బెదిరంపులను పట్టుకోబోమని తేల్చింది. కెనడా, యూరోప్ గట్టిగా ప్రతిఘటిస్తున్నాయి. సుంకాల సమరాన్ని అమెరికా అనివార్యం చేస్తే, చైనా వెనుకడుగు వేసే ప్రసక్తే లేదు. రాజీ లేని పోరుకు బీజింగ్ సమాయత్తమై ఉన్నది. ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధంపై భారత్ ఆచితూచి అడుగేస్తోంది.  మోదీ ప్రభుత్వం ఈ విషయమై జాగరూకతతో వ్యవహరించడం కూడా ముఖ్యమే. ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలను 90 రోజుల పాటు నిలిపివేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించడంతో అందరూ సంతోషిస్తున్నారు. ఈ యుద్ధ విరామంతో, ఆయనను ఆర్థిక వివేకం కలిగి ఆలోచన చేస్తే ఆయనతో పాటు..ప్రపంచ దేశాలకు కూడా మంచిదే. కానీ ఇలాగే సుంకాల యుద్ధం  కొనసాగిస్తే...దానికి ఫలితం కూడా అనుభవించక తప్పదు.  ట్రంప్ విధానాలతో ప్రపంచం ఆర్థిక మాంద్యంలోకి వెడుతోందని ఆర్థికవేత్తలు చాలా మంది గట్టిగా అభిప్రాయపడుతున్నారు. ఆర్థిక మాంద్యం ముంచుకు వస్తోందని కూడా పలువురు ఘంటాపథంగా చెబుతున్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోండి

**మంచిర్యాల,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):**


రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వడ్లను అమ్ముకొని మద్దతు ధర పొందాలని కాంగ్రెస్ సీనియర్ నేత, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. మంగళవారంచెన్నూర్ మండలంలోని ముత్తరావు పల్లె గ్రామంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు- చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన ముచ్చటించారు. రైతుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే రాష్ట్రంలో రైతులు ఆర్థికంగా బలపడుతున్నారని ఈ సందర్భంగా రైతులు ఎమ్మేలకు వివరించారు. రైతులు అందరికీ 500 బోనస్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చొరవతోనే.. మూడు సార్లు సీసీఐ పత్తి కొనుగోళ్ళు నిలిపివేసిన మళ్ళీ ప్రారంభించి రైతుల కష్టాలను దూరం చేశారని కృతజ్ఞతలు తెలిపారు.

# నేడు సంఘసంస్కర్త వీరేశలింగం పంతులు జయంతి

**వితంతు పునర్వివాహం కోసం పోరాడిన మహానుభావుడు**

**రాజమండ్రి,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్) :**

కందుకూరి వీరేశలింగం పంతులు ఎన్నో సామాజిక రుగ్మతలను నిలదీశారు. వాటిని అడ్డుకున్నారు. ప్రజల్లో ఉన్న మూఢాచారాలను నిలదీసారు. తనవంతుగా సంస్కరణలతో ముందుకు సాగారు. వింతతు వివాహాలను ప్రోత్సహించి సమజాంలో ఆడపిల్లలకు రోణగా నిలిచారు. వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16 న రాజమండ్రిలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. వీరి పూర్వీకులు ఇప్పటి ప్రకాశం జిల్లా లోని కందుకూరు గ్రామం నుండి రాజమండ్రికి వలస వెళ్ళడం వలన వారికి ఈ ఇంటి పేరు స్థిరపడిపోయింది. ఆయన సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి. సాహితీ వ్యాసారంగంలో ఎక్కువగా కృషి చేసాడు. తెలుగు జాతికి నవయుగ వైతాళికుడుగా ప్రసిద్ధి. వీరేశలింగం స్త్రీవిద్యకై ఉద్యమించి, ప్రచారం చెయ్యడమే కాక, బాలికల కొరకు పాఠశాలను ప్రారంభించాడు. మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు కూడా. అంటరాని కులాలకు చెందిన పిల్లలను కూడా చేర్చుకుని మిగతా పిల్లలతో కలిపి కూర్చోబెట్టేవాడు. వారికి ఉచితంగా చదువు చెప్పడంతో పాటు పుస్తకాలు, పలకా బలపాలు కొనిచ్చేవాడు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు పెళ్ళిళ్ళు చేసేవారు. కాపురాలకు పోకముందే భర్తలు చనిపోయి, వితంతువులై, అనేక కష్టనష్టాలు ఎదుర్కొనే వారు. దీనిని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాలు జరిపించాలని ప్రచారం చేయటమే కాకుండా ఎన్ని కష్టాలెదురైన ఆచరణలో పెట్టాడు. వీరేశలింగానికి నాలుగేళ్ళ వయసులో తండ్రి చనిపోయాడు. పెదతండ్రి, నాయనమ్మల పెంపకంలో అల్లారుముద్దుగా పెరిగాడు. ఐదో యేట బడిలో చేరి, బాలరామాయణం, ఆంధ్ర నామ సంగ్రహం, అమరం, రుక్మిణీ కళ్యాణం, సుమతీ శతకం, కృష్ణ శతకం మొదలైనవి నేర్చుకున్నాడు. పన్నెండో యేట రాజమండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీషు చదువులో చేరాడు. చిన్నప్పటినుండి, అన్ని తరగతులలోనూ, ప్రథమ శ్రేణిలోనే ఉండేవాడు. తన పదమూడో యేట బాపమ్మ (కందుకూరి రాజ్యలక్ష్మమ్మ) అనే ఎనిమిదేళ్ళ అమ్మాయితో బాల్యవివాహ మయింది. పెరిగి పెద్దయ్యాక వీరేశలింగం ఇటువంటి దురాచారాల నిర్మూలనకే కృషి చేసాడు. చదువుకునే రోజుల్లో కేశుబ్ చంద్ర సేన్ రాసిన పుస్తకాలు చదివి ప్రభావితుడయ్యాడు. విగ్రహారాధన, పూజలు మొదలైన వాటి మీద నమ్మకం తగ్గడమే కాక, దయ్యాలు, భూతాలు లేవనే అభిప్రాయానికి వచ్చాడు. ప్రజలకు అది నిరూపించడానికి అర్ధరాత్రి శ్మశానానికి వెళ్ళేవాడు. ఉపాధ్యాయుడిగా పిల్లలకు పాఠాలతో పాటు, సంఘ సంస్కరణ భావాలను బోధించాడు. సమాజంలోని దురాచారాలపై తన భావాలను వ్యాప్తి చెయ్యడానికి 1874 అక్టోబరులో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. ఆంధ్ర దేశంలో బ్రహ్మసమాజం స్థాపించాడు. యువజన సంఘాల స్థాపన కూడా వీరేశలింగం తోనే మొదలయింది. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేసాడు. 25 సంవత్సరాల పాటు రాజమండ్రిలో తెలుగు పండితుడిగా పనిచేసి, మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితుడిగా ఐదేళ్ళు పనిచేసాడు. ఆయన 130 కి పైగా గ్రంథాలు వ్రాసాడు. అన్ని గ్రంథాలు వ్రాసిన వారు తెలుగులో అరుదు. రాజశేఖర చరిత్ర అనే నవల, సత్యరాజా పూర్వ దేశయాత్రలు ఆయన రచనలలో ప్రముఖమైనవి. అనేక ఇంగ్లీషు, సంస్కృత గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. బడి పిల్లల కొరకు వాచకాలు వ్రాసాడు. స్వీయ చరిత్ర వ్రాసాడు. ఆంధ్ర కవుల చరిత్రను కూడా ప్రచురించాడు.



## పెరుగుతున్న విద్యుత్ వినియోగం

**మండుటెండలతో అధిక వాడకం**

అమరావతి,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్): ఎపిలో ఇటీవల విద్యుత్ కోతల కారణంగా ఉత్పత్తి కూడా తగ్గడంతో సరఫరాలో తీవ్రిబ్బందులు తప్పడం లేదు. నానాటికీ పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా సదరన్ డిస్కం పరిధిలోని జిల్లాల్లో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాది మార్చితో పోల్చుకుంటే ఈ ఏడాది మార్చిలో యూనిట్లు అధికంగా వినియోగించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచే ఉష్ణోగ్రతలు పెరుగు తూ వచ్చాయి. మార్చిలో గణనీయంగగా పెరిగిన ఎండలతో ఇనియోగం ఆ మేరకు పెరిగింది. దీంతో ప్రజలు ఫ్యాన్లు, ఏసీలు, కూలర్ల వినియోగం పెంచారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టే పనిలో ఉన్నారు. కోతలతో పాటు వినియోగం తగ్గించాలని సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ విద్యుత్ వినియోగం పెరిగినందున గ్రామీణ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచకపోతే సరఫరాలో ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని అధికారులు అంటున్నారు. గతంలో ఎన్నడూ ఇంతగా వినియోగంలేదని విద్యుత్‌శాఖ గణాంకాలు తెలుపుతున్నాయి. పెరుగుతున్న విద్యుత్ వినియోగానికి అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రాష్ట్రంలో విద్యుదుత్పత్తి, సరఫరా బాగానే ఉన్నా, ట్రాన్స్‌ఫార్మర్ల సంఖ్యను తగినంతగా పెంచుకోకుంటే అవి తరచూ పేలిపోయే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీవ్ర వేడి కొనసాగడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల 40 డిగ్రీలకు చేరువవుతోంది.  మరో రెండుమూడు రోజులు ఎండ తీవ్రత పెరగనుందని వాతావరణ శాఖ తెలిపింది. ఇప్పుడే ఇలా ఉంటే ఇక మే నెలలో ఎలా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకూ రోడ్లపై జనసంచారం కనిపించట్లేదు. భూగర్భజలాలు అడుగంటడం, భూతాపం పెరిగిపోవడంతో మంచినీటిసమస్య కూడా అధికం అవుతున్నది. బోర్లువేసి నీటిసమస్య కొంత తగ్గించాలని భావించినా ఎంత లోతుకు తవ్వినా నీళ్లు రాని పరిస్థితులు దాపురించాయి. వేసవి తాపంనుంచి ఉపశమనం పొందేందుకు ప్రభుత్వాలపరంగా ప్రత్యామ్నాయ ప్రణాళికలు లేవు. రాష్ట్రంలోని జలాశయాల్లో కూడా నీటివనరులు వేసవి తాపానికి ఆవిరి అవుతున్నాయి. మండుతున్న ఎండలు అటు శారీరక అస్వస్థతలు పెంచడంతో పాటు ప్రజల దాహార్తిని కూడా పెంచుతున్నాయి. ఉష్ణోగ్రతకు పక్షులు, పశువులు అసువులు బాస్తున్నాయి. ఉదయం పదిగంటలు దాటినప్పటినుంచీ రహదారులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉష్ణోగ్రత ప్రభావం, వడగాడ్పులు తీవ్రతరం కావడంతో రాష్ట్రంలో రేడియేషన్ ప్రభావం కూడా పెరుగుతున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## వేసవి దాహార్తి కోసం చలివేంద్రాలు

**మంత్రి సీతక్క ఆదేశాలతో పలు చోట్ల ఏర్పాటు**

**హైదరాబాద్,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్) :**

వేసవి దాహాన్ని తీర్చేందుకు పంచాయతీ రాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామాలు, మండల కేంద్రాల్లో భారీ సంఖ్యలో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 8,090 చలివేంద్రాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. వేసవి కాలంలో పనుల నిమిత్తం బయటకు వచ్చే ప్రజలకు తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఈ చర్యలు చేపట్టబడ్డాయి. మంత్రి సీతక్క స్పష్టమైన ఆదేశాలతో పీఆర్‌ఆర్‌డీ అధికారులు గ్రామాల నుంచీ రద్దీ ప్రాంతాల వరకు ప్రతి చోట చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు విరివిగా ఈ సేవలను వినియోగించుకుంటుండగా, మంత్రి సీతక్క విస్తృతంగా చలివేంద్రాల ఏర్పాటు-పై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే, కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందిని అభినందించారు. తాగునీటి సమస్యలు తలెత్తకుండా పీఆర్‌ఆర్‌డీ శాఖ ముందస్తుగా చర్యలు తీసుకుంటోంది. రాష్ట్రంలోని 31 జిల్లాల కలెక్టర్లకు ఒక్కో జిల్లాకు రూ. కోటి చొప్పున పీఆర్‌ఆర్‌డీ సొంత నిధుల నుండి ప్రత్యేక నిధులు కేటాయించబడ్డాయి. ఈ నిధులను అత్యవసర తాగునీటి అవసరాల కోసం ఖర్చు చేయాలని, మిషన్ భగీరథ నుండి నీరు అందని సందర్భాల్లో ప్రజలకు సమస్యలు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో ఫైనాన్స్ శాఖ నుండి ప్రత్యేక నిధుల మంజూరుపై అనుమతులు ఇచ్చినప్పటికీ, వాస్తవంగా నిధుల విడుదల జరగలేదని అధికారులు గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం పీఆర్‌ఆర్‌డీ సొంత నిధుల ఆధారంగా తక్షణ అవసరాలను తీర్చేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ వేసవిలో గ్రామీణ ప్రజలకు తాగునీటిలో ఇబ్బందులు లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పీఆర్‌ఆర్‌డీ స్పష్టం చేసింది.

## పర్యావరణ విధ్వంసం పట్టని ప్రజలు

**పెరుగుతున్న ఎండలతో జనం అవస్థలు**

**మొక్కలు నాటాలన్న స్పృహ లేని సమాజం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):**

పర్యావరణ విధ్వంసంపై దృష్టి పెట్టకపోవడంతో  భానుడు చెలరేగి పోతున్నాడు. ఎండ వేడిమి, వడ గాడ్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉత్తరభారతం అయితే క్రమంగా  నిప్పుల కొలిమిలా తయారవుతోంది. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే.. ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుండ టంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగ నుందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో పరిశుభ్రత, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాల్సిఉంది. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో ఉండడం వల్లనే చెట్లను నరికేస్తున్నా చోద్యం చూశారు. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటి కాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. ఇకపోతే ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పుకోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు ఇందుకు కారణ మయ్యాయి. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటి లే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికే స్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి  అతలాకుతలం అవుతు న్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు రెండు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది.  మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవుతుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి  సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇంతకాలం మనం చేసిన విధ్వంసం కారణంగానే అన్ని ప్రాంతాల్లో సాధారణం కన్నా మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే  వైరస్‌లు ఇకముందు కూడా దాడి చేస్తాయని గుర్తించాలి. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నద అలవాటు కావాలి. మొక్కలను పెంచడం మన బాధ్యత కావాలి.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem


# దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని బెంగళూరులో ఏర్పాటు చేస్తాం: సీఎం సిద్ధరామయ్య

**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

బెంగళూరులో అంబేద్కర్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని, మరియు దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. సోమవారం అంబేద్కర్ జయంతి సందర్భంగా బెంగళూరులో అంబేద్కర్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని, దేశంలోనే అత్యంత ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. పీసీసీ కార్యాలయంలోని భారత్ జోడో భవన్‌లో ఏర్పాటు చేసిన అంబేద్కర్ 134వ జయంతి కార్యక్రమంలో సీఎం సిద్ధరామయ్య పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలో మేం అమలు చేసిన ఎస్సీఎస్పీ/టీఎస్పీ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయగలరా నరేంద్ర మోదీ. ఈ చట్టాన్ని జాతీయ స్థాయిలో అమలు చేసి చూపాలని సవాల్ విసిరారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ కుటుంబాలు చెప్పే అబద్ధాలను ఎదిరించి నిజాలు మాట్లాడే ధైర్యం మన పార్టీ కార్యకర్తలు పెంపొందించుకోవాలి. కాంగ్రెస్ కార్యకర్తలకు సైద్ధాంతిక స్పష్టత ఉండాలి. ఎందుకంటే మనమందరం ఈ దేశ భవిష్యత్తు కోసం సైద్ధాంతిక పోరాటానికి నాయకత్వం వహించాలి. మనువాదులు మన రాజ్యాంగాన్ని ఎందుకు వ్యతిరేకించారు, అంబేద్కర్ మనుస్మృతిని ఎందుకు తగులబెట్టారు? ఈ విషయాన్ని మన కార్యకర్తలు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. ప్రజలకు, నేటి యువతకు వాస్తవాలు అర్థమయ్యేలా చూడాలని అన్నారు. అంబేద్కర్ జీవితం మనుస్మృతి మరియు కుల వ్యవస్థ కారణంగా దోపిడీ మరియు అణచివేతకు గురైన అన్ని కులాలు మరియు వర్గాల విముక్తి కోసం అంకితం చేయబడింది. అంటరానితనాన్ని రూపుమాపేందుకు, సామాజిక న్యాయం అందకుండా పోయిన వారికి మేలు చేసేందుకే తాను చదువుకున్నానని అంబేద్కర్ చెప్పిన మాటలు ఆయన ఆశయాలు ఏమిటో తెలియజేస్తున్నాయి. 1952 జనవరి 18న అంబేద్కర్ తన స్వంత చేతిరాతతో ఒక లేఖ రాశారు. ఎన్నికల్లో తనను ఓడించింది సావర్కర్, ధాగే అని ఆ లేఖలో స్పష్టంగా రాశారు. అయినా అంబేద్కర్‌ను ఓడించింది కాంగ్రెస్ అని బీజేపీ అబద్ధాలు చెబుతోంది. ఈ సత్యాన్ని ప్రజలకు చెప్పే ధైర్యం కాంగ్రెస్ కార్యకర్తలు పెంపొందించుకోవాలని అన్నారు. అన్ని కులాలు, మతాల వారిని సమానంగా పరిగణిస్తూ అందరి ప్రగతికి కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తున్న చరిత్ర, వర్తమానం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు.




# ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు







**బెంగళూరు జై భీమ్ న్యూస్ :**

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు బెంగళూరు నగరంలోని దొడ్డకనల్లిలో ఘనంగా నిర్వహించారు. దళిత నాయకుడు కనల్లి కృష్ణప్ప పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అంటరానివారుగా పరిగణించబడే పేద కుటుంబంలో పుట్టినా ఎదురుచూపులు కాచుకుంటూ ఎదిగి వచ్చారన్నారు. సాంఘిక పరమైన ఆర్థికపరమైన అవమానాలతో నిరంతరం పోరాడుతూ స్వయంకృషితో పైకి వచ్చారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ విదేశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసి జాతి గర్వించే స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఉన్నతాధికార హోదాలు, ధనార్జన ఆయన కాళ్లకు బంధనాలు వేయలేకపోయాయని చెప్పారు. ఎన్నో ఉన్నత పదవులను సైతం తునప్రాయంగా త్యజించి తన జీవితాన్ని దళిత జాతుల ఉన్నతికి అంకితం చేసిన మహనీయుడు అని కొనియాడారు. భారతదేశ ప్రథమ న్యాయశాఖ మంత్రిగా, రాజ్యాంగ రచన సంఘ అధ్యక్షునిగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ప్రతి పౌరునికి ప్రాథమిక హక్కులు లభించడానికి, చట్టం ముందు అందరూ సమానులేనని చాటడానికి, అస్పృశ్యత నేరం అన్న అంశాన్ని చట్టబద్ధం చేయడానికి ఆయన చేసిన కృషి మూల కారణమని పేర్కొన్నారు. తరతరాలుగా మతం పేరుతో బూజు పట్టిన భావాలతో తోటి వారిని ముఖ్యంగా మహిళలను విచక్షణకు, అవమానాలకు, అన్యాయానికి, అత్యాచారాలకు గురి చేస్తున్న వ్యవస్థపై పోరాటంలో భాగంగా ఆయన హిందూ కోడ్ బిల్లును రూపొందించారన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# ఐత సంపత్‌కు దళిత రత్న అవార్డు




**రాయపర్తి :(జై భీమ్ న్యూస్)**

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రానికి చెందిన అంబేద్కర్ వాది సామాజిక కార్యకర్త ఐత సంపత్ కు దళిత రత్న అవార్డు దక్కింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 వ జయంతి ఉత్సవాలలో భాగంగా దళితుల్లో అట్టడుగు వర్గాలకు అందించిన సేవలను గుర్తించి ఈ అవార్డు ప్రటించినట్లు తెలిపారు. ఈమెరకు రవీంద్రభారతిలో ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సంపత్ మాట్లాడుతూ..దళిత బడుగు బలహీన వర్గాలకు మానవ దృక్పధంతో చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి దళిత రత్న అవార్డుకు తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు తన యొక్క భాద్యతను మరింత పెంచిందన్నారు. ఇకపై దళితుల్లో అత్యంత వెనుకబడ్డ కులాల హక్కులకోసం నిరంతరం కృషిచేస్తానని తెలిపారు.

# ఫోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదీ శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులకు సత్కారం

**వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్**




గీసుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలికపై అత్యాచారం కేసులో నిందితుడికి జీవితాఖైదీ శిక్ష పట్టడంలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవికిరణ్ మర్రి వాసుదేవ రెడ్డి, భరోసా లీగల్ అడ్వైసర్ నీరజ, ఏసీపీ తిరుపతి, ఇన్స్ స్పెక్టర్ బాబూలాల్, మహేందర్, హెడ్ కానిస్టేబుల్ విజేందర్, కానిస్టేబుళ్లు శ్రవణ్, యుగంధర్ లను ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ సత్కరించారు.

# జిల్లాలో అమల్లోకి నూతన భూభారతి చట్టం

**నూతన చట్టంపై ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహించాలి**




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

హనుమకొండ ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం జిల్లాలో అమల్లోకి వచ్చిందని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో ధరణి స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టానికి సంబంధించిన మార్గదర్శకాల పై జిల్లాలోని తహషీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు, రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నూతన చట్టం లో కల్పించిన హక్కులు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్ధీకరణ, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, న్యాయ సహాయం, గ్రామ రెవెన్యూ రికార్డులు, తదితరాంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ నారాయణ, రాథోడ్ రమేష్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భూభారతి చట్టం గెజిటె ప్రతులు, జీవో నెంబర్ పత్రాలు ప్రతి తహసిల్దార్, డిప్యూటీ తహషీల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ల వద్ద తప్పనిసరిగా ఉండాలన్నారు. ఈనెల 17వ తేదీ నుండి ప్రతి మండలంలో అమలులోకి వచ్చిన భూభారతి చట్టానికి సంబంధించిన అంశాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతి మండలంలో ఒకే రోజు రెండు మండలాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. గ్రామాలలో నిర్వహించే సదస్సులకు స్థానిక ఎమ్మెల్యే తో పాటు భూమి హక్కులకు సంబంధించి అవగాహన ఉన్న వ్యక్తులను, మీసేవ కేంద్రాల ఆపరేటర్లను సదస్సులకు ఆహ్వానించాలన్నారు. ప్రజలు రైతులకు అనువైన ప్రదేశంలో సదస్సును నిర్వహించాలన్నారు. తహసిల్దార్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేయాలన్నారు. చట్టంలోని అంశాలను ప్రజలకు అర్థమయ్యే విధంగా సదస్సు నిర్వహించాలన్నారు. ప్రజలు భూ సమస్యలపై వెల్లడించిన అభిప్రాయాలను నమోదు చేయాలన్నారు. ధరణి స్థానంలో వచ్చిన భూభారతి చట్టం మార్గదర్శకాలు తహసిల్దార్ల లాగిన్లకు వచ్చాయని అన్నారు. నూతన చట్టం మార్గదర్శకాల ప్రకారం చేయాలన్నారు. ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలు దరఖాస్తులు అందించినట్లయితే వాటిని స్వీకరించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, తహశీల్దార్లు, నాయబ్ తహసిల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కేయూ పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

**చలో సచివాలయం విజయవంతం చేయాలి**

**కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం అధ్యాపకుల సంఘం**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కాకతీయ యూనివర్సిటీ పార్ట్ టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం కేయూ పార్ట్ టైం అధ్యాపకుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో కేయూ కాంటీన్ దగ్గర సమావేశం జరిగింది. ఈ నెల 17న జరిగే చలో సచివాలయం విజయవంతం చెయ్యటం కోసం చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో కేయూ పార్ట్ టైం అధ్యాపకులు డాక్టర్. కె. నాగేశ్వరరావు అధ్యక్షత నిర్వహించిన ఈ సమావేశంలో 21 నెంబర్ రద్దు చేస్తూ ఉద్యోగ భద్రత సర్వీస్ రెటిఫికేషన్, మిగతా విషయాలపై చర్చిచటం జరిగింది. ఈ సమావేశములో వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ వి.విజయ్ కుమార్, అడ్వసర్స్ ఎంకె సుమంత్ డాక్టర్. ఓ. మోహన్. సీనియర్ అధ్యాపకులు, శ్రీకాంత్ యాదవ్, చారీ, మమతా, రజిత, విష్ణు, రవి, రామజ్యోతి, వాణిశ్రీ,. రజనికుమార్, దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రావీణ్య**



**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

జిల్లాలో ఇందిరమ్మ గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా అధికారులు పూర్తిచేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ కార్యాలయం నుండి ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ మాట్లాడారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ మొదటి దశలో సొంత స్థలం ఉన్న అత్యంత నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతి మండలంలోని ఒక గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం మొదలైందని మిగిలిన గ్రామాలలో గృహ నిర్మాణ లబ్ధిదారుల ఎంపికను అధికారులు పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల మంజూరీ కోసం నియోజకవర్గ, మండల స్థాయి ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ ద్వారా వచ్చిన లబ్ధిదారుల ప్రతిపాదనలను క్షుణ్ణంగా పరిశీలించి తదుపరి మంజూరుకు ప్రతిపాదిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, పరకాల ఆర్డీవో డాక్టర్ కే. నారాయణ, కాజీపేట మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఎల్‌బీ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలి

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఎల్.ఎల్.బీ 3, 5 సంవత్సరాల కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు వెంటనే అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలని విద్యార్థులు వైస్ ఛాన్సలర్ కె. ప్రతాప్ రెడ్డికి వినతిపత్రం అందజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే ఒక సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు మొత్తం ఏడాది వృథా చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ఉస్మానియా, శాతవాహన విశ్వవిద్యాలయాలు ఇప్పటికే లా కోర్సులకు అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం యూజీ కోర్సులకు (బీఏ, బీకాం) ఇప్పటికే ఇలాంటి పరీక్షలు ప్రకటించిందన్నారు. విద్యార్థుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనివ వెంటనే అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరిక్షలు నిర్వహించాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో విద్యార్థులు గజ్జి దయాకర్, సత్యనారాయణ రెడ్డి ఎర్ర, సుధాకర్ గాదె, గౌరీశంకర్, కృష్ణ చైతన్య, నిజాముద్దీన్, సందీప్, అభిషేక్, సుష్మా, పవన్, శ్రవణ్ ఇతరలా విద్యార్థులు పాల్గొన్నారు.



# భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహణ కల్పించాలి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ జిల్లా జై భీమ్ న్యూస్**



జిల్లా కలెక్టరేట్లో మంగళవారం నిర్వహించిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం పై తహసీల్దార్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,అదనపు కలెక్టర్ జి సంధ్యా రాణిలు పాల్గొని భూభారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత తాసిల్దార్లను ఆదేశించడమైనది. ఏప్రిల్ 14 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా హైదరాబాద్ శిల్పకళా వేదిక నందు భూ భారతి పోర్టల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్లతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో భూభారతి చట్టం అమలు తీరు పై దిశ నిర్దేశాలని అమలుచేసే తీరును జిల్లా కలెక్టర్ ఆర్డీవోలు వివిధ మండలాల తాసిల్దార్లతో సమీక్ష నిర్వహించి ఏప్రిల్ 17వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ప్రతి మండలంలో భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ రూపకల్పనతో పాటు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో భూ భారతి చట్టం హెల్ప్ లైన్ నంబర్ 040 29313999 ఏర్పాటు చేసి చట్టంపై ప్రజలకు సలహాలు, సూచనలు అందచేయాలని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలపై సమగ్రమైన నోట్స్ తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ భారతి నూతన చట్టం ప్రకారం మాత్రమే రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, సక్సేషన్లు, సాదా బైనామ చేయాలని తెలిపారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై రెవెన్యూ అధికారులు సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. భూ భారతి చట్టాన్ని జిల్లాలోని మండలాన్ని ఒక పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ప్రణాళిక సిద్ధం చేయాలని సంబందిత తహసీల్దార్లను ఆదేశించారు. భూ భారతి నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు జిల్లాలోని తెలంగాణ సంస్కృతిక సారధి కళాకారులచే విస్తృతంగా ప్రచారం చేయించాలని జిల్లా పౌర సంబంధాల అధికారిని ఆదేశించడమైనది. క్షేత్ర స్థాయిలో ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిగణలోకి తీసుకుని ప్రభుత్వానికి నివేదికలు పంపాల్సి ఉంటుందని తెలిపారు. వేసవి దృష్ట్యా అవగాహన సదస్సులు నిర్వహణ లో అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విజయలక్ష్మి ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి నర్సంపేట ఉమారాణి మరియు సంబంధిత మండలాల తాసిల్దారులు కలెక్టరేట్ సూపర్డెంట్లు పాల్గొన్నారు.

# కేయూ వీసీకి నిరవధిక సమ్మె నోటీస్ ఇచ్చిన కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**హన్మకొండ జై భీమ్ న్యూస్**



గత కొన్ని ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో యూనివర్సిటీలో విద్యా ప్రమాణాలను కాపాడుతున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల తమ న్యాయమైన డిమాండ్ రెగ్యులరైజేషన్ ప్రక్రియను తక్షణమే అమలు చేయాలని అనేకమార్లు అనేక ప్రభుత్వాలకు మొరపెట్టుకున్న సమస్య పరిష్కారం కాలేదని, గత వారం రోజులుగా అనేక నిరసనలు చేపట్టిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని దీన్ని నిరసిస్తూ స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం రోజున సమ్మె నోటీసును కాకతీయ యూనివర్సిటీ వైస్ వీసీ ప్రొ. కె. ప్రతాపరెడ్డికి అందజేయడం జరిగింది. అంతేకాకుండా పలువురు అధ్యాపకులు ప్రభుత్వ వ్యవహార శైలిని నిరసిస్తూ తమ అడ్మినిస్ట్రేషన్ పదవులకు కూడా రాజీనామా చేయడం జరిగింది. అట్టి రాజనామా పత్రాలను కేయూ రిజిస్ట్రార్, వీసీలకి అందజేయడం జరిగింది. అంతకుముందు కేయూ కాంట్రాక్ట్ అధ్యాపకులు అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ వద్ద పెద్ద పెట్టున నినాదాలతో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కేయూ కోఆర్డినేషన్ కమిటీ నేతలు డా. నిరంజన్, డా. శ్రీధర్ కుమార్ లోద్, డా. మాదాసి కనకయ్య, డా. జూల సత్య తదితరులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాన్ని అమలు చేయమని కోరుతున్న పట్టించుకోవడంలేదని గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలన్నీ గుర్తు చేసిన కనీస పట్టింపు లేకుండా పోతుందని, అందుకే రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు నిరవధిక సమ్మెలోకి ఈ నెల 19 నుండి వెళ్లబోతున్నారని అన్నారు. అంతేకాకుండా 16, 17 తేదీలలో ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాను తలపెట్టినామని ఈ మహా ధర్నాకి రాష్ట్రంలో అన్ని రకాల రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తున్నామని, మా ఆవేదనను రాజకీయ పార్టీలకు నాయకులకు ఇప్పటికే నివేదించామని, ప్రభుత్వాన్ని తప్పుదారిని పట్టిస్తున్న ప్రభుత్వ అధికారులు ను పక్కకు పెట్టి మా సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి చోరువా చూపుతారని ఆశాభావం ఇంకా ఉందని, తప్పనిసరి పరిస్థితుల్లో మా ఆవేదనను ఆవిష్కృతం చేయడం కోసమే ఈ నిరవధిక సమ్మెకు వెళు తున్నామని, రేపు ఎల్లుండి జరగబోయే కార్యక్రమాల్ని విజయవంతం జరగాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డా.సాదు రాజేష్, డా. బి సతీష్ డా. ఫిరోజ్ పాషా,డా. ఆశీర్వాదం, డా. సంకినేని వెంకన్న,, డా. ఆరూరి సూర్యం, డాక్టర్ గడ్డం కృష్ణ, డా.టీ. నాగయ్య, డా. సూర్యనారాయణ, డా. చంద్రశేఖర్, డా. రఘు వర్ధన్ రెడ్డి, డా. వినీత,డా. శ్రీదేవి, డా. వీణ, డా.సునీత, డా. సుచరిత పాల్, డా.సుజాత, డా. శ్రీలత, డా.సంగీత్ కుమార్, డా. భాగ్య డా. ఉషాకిరణ్, వాణిశ్రీ, డా. స్వామి, డా. సదాశివ, తూర్పాటి వెంకటేశు,సాహితీ, డా. చందులాల్, డా. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచానికే దిక్సూచి డాక్టర్ బిఆర్ అంబేడ్కర్

**ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు**

**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**



విశ్వరత్న ప్రపంచ మేధావిగా కీర్తిప్రతిష్టలు పొందుతున్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచానికే దిక్సూచి అని ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. భారత రత్న, భారత రాజ్యాంగం నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 134 జయంతిని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయం ఎబివిపి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం-అంబేద్కర్ దార్శనికత అనే అంశంపై నిర్వహించిన సెమినార్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ముందుగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి జాత్యహంకారం, ద్వేషం, కులవివక్షత, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి భారత దేశం లో కుల రహిత సమాజాన్ని కాంక్షించిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గ్లోబల్ ఐకాన్ అని ఆయన జీవితం నేటి తరాలకే కాక బావి తరాలకు కూడా ఆదర్శనీయమని ఎబివిపి రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 130వ జయంతి సందర్భంగా ఎబివిపి నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కాకతీయ విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి ఏ మాత్రం ఆవేదన, ఆక్రందనలు లేకుండా జీవితంలో ఒకసారి అయినా ఆహారం, మంచినీరు, ప్రాథమిక విద్య, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, గౌరవం, న్యాయం, శాంతి సంతోషాలతో జీవించాలని అంబేద్కర్ ఆకాంక్షించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేయూ ఎబివిపి అధ్యక్షుడు మేరుగు సాయి కుమార్, అంబాల కిరణ్, పూజ, డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, గట్టు ప్రశాంత్, సంయుక్త, సాయి ప్రియ, శివ, ఎలేంద్ర, జగత్ కృష్ణ, చంద్ర శేఖర్, జ్ఞానేశ్వర్, సరయు చైతన్య, కావ్య శ్రీ, తనుజ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు తక్షణం డబుల్ బెడ్రూం ఇల్లు కేటాయించాలి

**పి.డి.ఎస్.యు జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్**




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

పి.డి.ఎస్.యు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దేశాయిపేట టౌన్షిప్ దగ్గరలో పాత్రికేయుల దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి పూర్తి సంఘీభావం తెలపడం జరిగింది. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్ కుమార్ మాట్లాడుతూ దేశాయిపేట టౌన్షిప్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ గృహాలను తూర్పు నియోజకవర్గం జర్నలిస్టులకు కేటాయించాలని కోరారు, ఈరోజు జర్నలిస్టులు అనేక ఇబ్బందులతోటి వారి జీవితాలను గడుపుతున్నారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జర్నలిస్టులకు వారి మేనిఫెస్టోలో అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు హెల్త్ కార్డులు డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు ఉచిత బస్సు పాసులు కల్పిస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల పైన బెదిరింపు చర్యలకు పాల్పడుతుందని అసెంబ్లీ సాక్షిగా కూడా రేవంత్ రెడ్డి జర్నలిస్టులపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడ్డాడని, ఇప్పుడు గత ప్రభుత్వం వారి కేటాయించిన గృహాలను ఇప్పుడు వారికి ఇవ్వకుండా కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని తక్షణమే జర్నలిస్ట్ సంఘ నాయకుల తోటి చర్చలు జరిపి అర్హులైన జర్నలిస్ట్ మిత్రులందరికీ డబల్ బెడ్ రూమ్ ఇల్లులను కేటాయించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో హన్మకొండ జిల్లా అధ్యక్షుడు వంశీ జిల్లా కమిటీ సభ్యులు ముషారఫ్ జిల్లా నాయకులు ఠాగూర్ సాయి పాల్గొన్నారు.

# విజేతలను రోల్ మోడల్స్‌గా ఎంచుకోండి

**కేయూ వీసీ ఆచార్య కే. ప్రతాప్‌రెడ్డి**




**హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్**

విజేతలను రోల్ మోడల్స్‌గా ఎంచుకోండి అని కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి అన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ కామర్స్ అండ్ బిజినెస్ మానేజ్మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. అమర వేణి అధ్యక్షతన ఏప్రిల్ 15వ తేదిన కళాశాల సెమినార్ హాల్ లో కామర్స్, మానేజ్మెంట్ విద్యార్థులు నిర్వహిస్తున్న సినేర్జి 2కే - 25 కామర్స్ అండ్ మనజ్మేంట్ విద్యార్థులు మీట్ ముగింపు సమావేశంలో ముఖ్య అతిదిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు, ప్రతి ఒక్కరికి ఒక రోల్ మోడల్ ఉండాలని, వారి వారి బలాలు, బలహీనతలు, ట్రైట్స్ తో మరింత ముందుకు వెళ్ళవచ్చు అన్నారు, 2030 వరకు ప్రపంచంలోనే మూడవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని, ఈ నైపధ్యంలో కామర్స్ మేనేజ్మెంట్ విద్యార్థులకు విస్తృత అవకాశాలు ఉన్నాయి అన్నారు. కేవలం తరగతి లోనే కాకుండా ఇటువంటి సమ్మేళనం ద్వార మరిన్ని నేర్చుకోగలుగుతారు అన్నారు, ప్రతి ఒక్కరు ప్రొఫెషనల్ నెట్ వర్క్ ను డెవలప్ చేసుకోవాలి అన్నారు, ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలు విజేతల కు బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే. ఓంప్రకాష్, ఆచార్య కే. రాజి రెడ్డి, ఆచార్య కృష్ణమా చారి, ఆచార్య రాజేశంతో పాటు పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, పి.జి. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. వరలక్ష్మి పాల్గొన్నారు, ఉదయం ప్రారంభ సమావేశానికి పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ముఖ్య అతిదిగా పాల్గొనగా పి.జి.కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. వరలక్ష్మి, విశ్రాంత ఆచార్యులు ఆచార్య కే. రాజి రెడ్డి, ఆచార్య పి.కృష్ణమా చారి, ఆచార్య సిహెచ్ రాజేశం పాల్గొన్నారు. మొత్తం 63 మంది విద్యార్థులు వివిధ ఈవెంట్ ల పాల్గొన్నారు. విజేతలకు బహుమతి ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణింద్ర, డాక్టర్ ప్రగతి, డాక్టర్ రవీందర్ తో పాటు పలువురు బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు, నగరంలోని పలు కళాశాలల కామర్స్ అండ్ మానేజ్మెంట్ విద్యార్థులు పాల్గొన్నారు.

## లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం

**అమరావతి,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):**

వైసీపీ హయాంలో జరిగిన లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటు–చేసుకుంది. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈనెల 18వ తేదీన విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. గతంలో లిక్కర్ స్కామ్ కేసుపై సాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సాక్షిగా వాంగ్మూలం ఇచ్చేందుకు రావాలంటూ సిట్ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.ఇదిలా ఉండగా.. మద్యం కుంభకోణంలో కీలక పాత్ర పోషించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బంధువు, వైసీపీ ప్రభుత్వ ఐటీ–సలహాదారు రాజ్ కసిరెడ్డి కోసం పోలీసులు, సిట్ అధికారులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. విచారణకు హాజకావాలని హైకోర్టు చెప్పినా.. ఆదేశాలను లెక్కచేయకుండా కసిరెడ్డి తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ మేరకు హైదరాబాద్‌లో సోమవారం నాడు ఏకకాలంలో 15 చోట్ల సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఉన్న కసిరెడ్డి ఇళు ,, కార్యాలయాల్లో తనిఖీలు చేశారు.

జై భీమ్
తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
Jai Bheem

# ఉద్యోగుల సంక్షేమమే మా ఎజెండా!

తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ

హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్




తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ అధికారుల, ఉపాధ్యాయుల, కార్మిక మరియు పెన్షనర్ల జాయింట్ యాక్షన్ నూతన కమిటీ నిర్మాణము హనుమకొండ టీఎన్జీవో భవన్లో నిర్వహించారు. ఇట్టి సమావేశమునకు జిల్లాలోని టీఎన్జీవో, టీజీవో, ఉపాధ్యాయ, నాలుగవ తరగతి ఉద్యోగులు, కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ సంఘాల నేతలు హాజరైనారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ గా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజేందర్, కన్వీనర్ గా టీజీవో జిల్లా అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, , పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు తిరుపతిరెడ్డి కోకన్వీనర్ గా, టీజీవో నేత అన్నమనేని జగన్ మోహన్ రావు గౌరవ అధ్యక్షులుగా మిగతా కార్యవర్గాన్ని కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా జేఏసీ చైర్మన్ ఆకుల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచిందని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల, పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు, పెన్షనర్లకు సంబంధించి దాదాపు 57 రకాల సమస్యలు దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిలో 45 సమస్యలకు పైగా ఆర్థికపరమైనవి కావన్నారు. ఈ సమస్యల పరిష్కారం వలన ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం ఉండబోదని అన్నారు. ఈ నలభై ఐదు సమస్యలకు పాలన పరంగా నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనివలన ఉద్యోగులకు కొంతైనా ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. ఐదు డిఎలు తక్షణమే ఇవ్వాలని, పి.ఆర్.సిని వెంటనే ఖరారు చేయాలని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని జేఏసీ పక్షాన డిమాండ్ చేశారు. సమస్యల సాధన కొరకు రాష్ట్ర జేఏసీ నాయకత్వం ఇచ్చే పిలుపుకు అనుగుణంగా జిల్లాలో కార్యాచరణ తీసుకుంటామని అన్నారు. జిల్లాలో ఉద్యోగ సంఘాల జేఏసీని బలోపేతం చేస్తామని అన్నారు. కన్వీనర్ మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయి జేఏసీ కార్యవర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు జిల్లాలో కార్యాచరణ తీసుకుంటామని ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. రాష్ట్ర జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ని ఏర్పాటు చేయాలని కోరారు. కో కన్వీనర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలుగా పనిచేసిన ఉద్యోగులు దాచుకున్న డబ్బు కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే ఉద్యోగులకు, పెన్షనర్లకు సంబంధించిన అన్ని బిల్లులను వెంటనే చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మరియు ఉద్యోగులు పెన్షనర్లు సమాన సహకారంతో ఉద్యోగుల ఆరోగ్య పథకం వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్నీ కోరారు. గౌరవాధ్యక్షులు జగన్మోహన్రావు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన ఆర్థిక మరియు ఆర్థికేతర డిమాండ్లన్నిటిని వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 317 జీవో బాధితుల సమస్యలను ప్రాధాన్యత అంశంలో తీసుకొని వెంట వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు బైరి సోమయ్య, డాక్టర్ ప్రవీణ్, శ్రీహరి, శ్రీనివాస్, పుల్లూరు వేణుగోపాల్, పనికెల రాజేష్,సర్వర్ హుస్సేన్, శ్యాంసుందర్, గోపాల్ రెడ్డి, రవీందర్ పెండం రాజు, రాంబాబు, రాజి బాపు రావు,సత్యనారాయణ, శ్రీనివాస్, బాబు, కృష్ణ రావు, పెద్ద ఆంజనేయులు, కోడెం రవి ప్రకాష్మరియు వివిధ ఉద్యోగ సంఘాల నేతలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు, పెన్షనర్ సంఘాల నేతలు, కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏప్రిల్ 21వ తేది నుంచి యధావిదిగా కేయూలో డిగ్రీ పరీక్షలు



హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

కాకతీయ విశ్వవిద్యాలయ డిగ్రీ (నాన్ ప్రొఫెషనల్) రెండవ, నాల్గవ, అరవ సెమిస్టర్ రెగ్యులర్ పరిక్షలు, మొదటి, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ పరిక్షలు ముందుగా ప్రకటించిన విధంగా ఏప్రిల్ 21వ తేది నుంచి యధావిదిగా జరుగుతాయని విశ్వవిద్యాలయ పరిక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటన లో తెలిపారు. ఏ ఏ కళాశాలలలు అయితే విద్యార్థుల పరిక్షల ఫీజు చెల్లించియో ఆ కళాశాలల విద్యార్థులకు మాత్రమే పరిక్షలు నిర్వహిస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలు విశ్వవిద్యాలయ వెబ్ సైట్ www.kakatiya.ac.inలో చూడవచ్చు అన్నారు.

# ఇండ్ల స్థలాలలే మా ధ్యేయం

జనని హౌసింగ్ సొసైటీ




హన్మకొండ జిల్లా జై భీమ్ న్యూస్

జననీ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న తెలంగాణ గెజిటెడ్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్నతరహా మధ్యతరహా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలకు ఎలా ఏర్పాట్లు చేసుకోవాలనే అంశంపై ఈ సర్వసభ్య సమావేశానికి నూతన కార్యవర్గ పాలకవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికల చానల్ల జర్నలిస్టులతో పాటు మహిళా జర్నలిస్టులను ఈ సంఘంలో తీసుకొని వారికి ప్రత్యేక హోదాను కల్పించడం ఏర్పాటు చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉపాధ్యక్షులు మరుపట్ల జయపాల్ మాట్లాడుతూ పదవులకే పరిమితం కాకుండా మాటలతో చెప్పకుండా చేతల్లో పనులు నిర్వహించాలని ఈ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు అతి త్వరలో ఇండ్ల స్థలాల కోసం వివిధ ప్రాంతాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులను సంప్రదిస్తామని చిన్న మధ్య తరహా తేడా లేకుండా ప్రతి జర్నలిస్టుకి ఈ సంఘంలో ఇండ్ల స్థలాలు ఏర్పాటు విషయంలో ఈ సంఘం పాలకవర్గం ముందుంటుందని అన్నారు.అలాగే జర్నలిస్టుల కోసం ఇన్సూరెన్స్ పాలసీను (ప్రమాద భీమా) కూడా ఏర్పాటు చేస్తున్నామని, అనారోగ్య పరిస్థితుల్లో ఈ సంఘంలో ఉన్న ఏ జర్నలిస్టుల కైనా సంఘం తరఫున ప్రతి సభ్యుడు తన వంతు సహాయం అందిస్తామని తెలిపారు. అలాగే మహిళా జర్నలిస్టులలో వివిధ ఛానల్స్ కి చెందిన న్యూస్ ప్రెసెంటర్స్ స్వప్న, రమ్య, రజిని, రమ్య శ్రీ, మంజుల ఇతర సీనియర్ జర్నలిస్టులు ఈ సమావేశంలో పాల్గొని వారికి సంబంధించిన సలహాలు సూచనలు వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం నుండి గాని ప్రజా ప్రతినిధుల నుండి గాని మన చిన్న మధ్య తరహా జర్నలిస్టులకు న్యాయం జరిగేలా చూడాలని అన్నారు. జనని హౌసింగ్ సొసైటీ సంఘం ఆధ్వర్యంలో ఉత్తమ మహిళా జర్నలిస్ట్ అవార్డు తీసుకున్న జర్నలిస్ట్ రజిని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించినందుకు ప్రతి మహిళా జర్నలిస్టులను గుర్తించాలని ఈ సంఘం జర్నలిస్టులు కోరారు. మహిళా జర్నలిస్టు ముందుకు రావాలని ఇలాంటి సంఘంలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి దామోదర్ కోశాధికారి సునీల్ ఉప కోశాధికారి రమేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఉపాధ్యక్షులు మరపట్ల జయపాల్ సంఘం జర్నలిస్టులు అనిల్ కాందారి తదితరులు పాల్గొన్నారు.

# మా బాబు ప్రాణాలు కాపాడండి

బాబు తండ్రి చింత కరుణాకర్ ఆవేదన
ఆపన్న హస్తం (ఆర్థిక సహాయం) కోసం ఎదురుచూపు..
రెయిన్ బో చిల్డ్రన్స్ మెడికేర్ హాస్పిటల్ బంజారాహిల్స్ లో చికిత్స పొందుతున్న బాబు

హైద్రాబాద్ జై భీమ్ న్యూస్



గత నెల హోలీ రోజున చింత కరుణాకర్ కుమారుడు 2సం. ల బాబు ప్రమాదవశత్తు వేడి నీటిలో పడిపోయి ఒళ్ళంతా కాలిపోయింది ప్రాణాలతో కొట్టుమిట్టాడుతుంది. గత రెండు నెలలుగా హైద్రాబాద్ బంజారాహిల్స్ లోని రెయిన్ బో చిల్డ్రన్స్ మెడికేర్ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మా ఇళ్లు వాకిలి అమ్మి ఇప్పటివరకు దాదాపుగా 20లక్షలు పెట్టి చికిత్స చేపించామని ఇంకా 10లక్షల నుండి 1లక్షలు వరకు అవుతుందని డాక్టర్లు చెప్పారు. కరుణమూర్తులు, దయహృదయంతో మా బాబు ప్రాణాలు కాపాడుకోవడానికి దాతలు సహాయం చేయాలని, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే, అధికారులు, దయార్థ హృదయులు ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించండని సోషల్ మీడియాలో ప్రతిఒక్కరిని చింత కరుణాకర్ వేడుకున్నారు. వివరాల కోసం సెల్ 90106 25680 ఫోన్ చేసి సహాయం అందించాలని కోరారు.

# గంజాయి, హాశీష్ ఆయిల్‌తో పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసిన హన్మకొండ పోలీసులు

వరంగల్ జై భీమ్ క్రైమ్ న్యూస్

వరంగల్ పోలీస్ కమిషనరెట్ హన్మకొండ పోలీస్ స్టేషన్ పరిధి రెడ్డికాలనీ ఏరియాలో ఎస్ఐ పరుశు రాములు పెట్రోలింగ్ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు ఒక్క ఆటో, బండితో ఉండి పోలీస్ వారిని చూసి పారిపోవుటకు ప్రయత్నం చేయగా పట్టుకొని విచారించగా వారు కోటగిరి సాయి వినయ్ అలియాస్ వినయ్ తండ్రి శ్రీనివాస్ సుధానగర్, హన్మకొండ, ప్రస్తుతం రెడ్డి కాలనీ హన్మకొండ అని ఇతను 2023 సంవత్సరంలో తన స్నేహితుడు వరుణ్ తో ఆంధ్ర మారేడుమిల్లి టూర్ కి వెళ్లి గంజాయి తీసుకొని తిరిగి వస్తుండగా డొంకరాయి పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేసి రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపగా జైల్ లో లావుడియా రవీందర్ ములుగు పరిచయం అయి తాను గంజాయి అమ్ముతుంటానని తన ఫోన్ నెంబర్ %ఇఇఇఇఇఇఇఇఇఇ% ఇచ్చినాడని, అలాగే గణేష్ నిమజ్జనం జరుగుతున్నపుడు గొడవ కాగా హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో హత్యాయత్నం కేసు నమోదు కాగా ఖమ్మం సెంట్రల్ జైలుకు పంపగా అప్పుడు జైలులో హరి, కబీర్ సింగ్ అనే వ్యక్తి పరిచయం అయి వీరు సాయి ఫోన్ నెంబర్ తీసుకున్నారు. అందాద 3 వారాలక్రితం హరి, సాయికి ఫోన్ చేసి, తన దగ్గర గంజాయి నుండి తీసిన ఆశిష్ ఆయిల్ ఉంది దీనిని సిగారెట్స్ కు పూసి త్రాగాలి కిక్కు బాగా ఉంటుంది అని చెప్పినాడు ఇది కిలో 12,50,000/- రూపాయలు ఉంటుందని చెప్పి, హరి అన్న రామూర్తి హాశీష్ ఆయిల్ ను వరంగల్ రైల్వే స్టేషన్ లో ఇచ్చి వెళ్ళగా సాయి ఇంట్లో పెట్టినాడు, 10 రోజుల క్రితం లావుడియా రవీందర్, గుగులోత్ హరిసింగ్ రవీందర్ ఆటోలో ఒక్క లాగేజ్ బ్యాగును 12 కిలోల ఎండు గంజాయి తీసుకొని సాయికి ఇవ్వగా ఇంట్లో దాచి పెట్టినాడు. ఇందులో నుండి 2 కిలోల గంజాయి ని కుశాల్, హరీష్, జై సింహలకు అమ్మి, మిగతాది సాయి ఇంట్లో దాచి పెట్టినాడు. తర్వాత సాయి రవీందర్ కి ఫోన్ చేసి తన దగ్గర ఉన్న ఆశిష్ ఆయిల్ ఉందని చెప్పి ఎవరికీ ఐన అమ్ముదామని చెప్పగా మంగళవారం రవీందర్, గుగులోత్ హరిసింగ్ రవీందర్ ఆటోలో సాయి ఇంటికి రాగా సాయి బైక్ పైన తన దగ్గర ఉన్న గంజాయి లాగేజ్ బ్యాగ్ పెట్టుకొని, ఆశిష్ ఆయిల్ ని స్టీల్ డబ్బా రవీందర్, హరికి ఇవ్వగా వాళ్ళు రవీందర్ ఆటోలో ఇక్కడికి వచ్చి హైదరాబాద్ కి ఎలా వెళ్ళాలా అని ఆలోచిస్తుండగా పోలీసు వారు పట్టుకున్నారని చెప్పగా వీరిని పోలీస్ స్టేషన్ కు తీసుకవచ్చి పిర్యాదు ఇవ్వగా ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి, అట్టి వ్యక్తుల వద్ద ఉన్న గంజాయిని తీసుకొని ఆ ముగ్గురు వ్యక్తులను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ పై కోర్టులో హాజరు పరుస్తున్నారని చెప్పారు. వారి వద్ద నుండి 10-కిలోల ఎండు గంజాయి విలువ 5,00,000/-, 2-కిలోల హాశీష్ ఆయిల్ విలువ 25,00,00/-, 3- సెల్ ఫోన్, 1-రాయల్ ఎన్ఫీల్డ్ మోటర్ సైకిల్, 1- బజాజ్ ఆటో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీసీపీ షేక్ సలీమ ఐపీఎస్ సెంట్రల్ జోన్, వరంగల్ కమిషనరేట్ హన్మకొండ పోలీస్ స్టేషన్ సిబ్బందిని, టిజీ - ఎన్ఏబి వరంగల్ సిబ్బందిని అభినందించారు.




# నిబంధనలను ఉల్లంఘించే మిల్లర్లను ఉపేక్షించం

ధాన్యం సకాలంలో మద్దతు ధరలకు కొనాల్సిందే
ధాన్యం కొన్న 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు
పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

విజయవాడ,ఏప్రిల్15(జై భీమ్ న్యూస్):

రైతుకు కష్టం.. నష్టం కలిగితే సహించేది లేదని.. నిబంధనలు ఉల్లంఘించే మిల్లులను డీ ట్యాగ్ చేస్తామని.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే ఇతర జిల్లాల మిల్లర్ల ద్వారా సేకరిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. వివిధ మార్కెట్‌యార్డులోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ధాన్యపు రాశుల్ని పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్‌లో కనీవిని రీతిలో దాదాపు 38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రూ. 8,300 కోట్లతో ఆరు లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేయడం జరిగిందని.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రణాళికాయుతంగా వ్యవహరించి ధాన్యం సేకరణ చేసినట్లు తెలిపారు. 24 గంటల్లోపే ధాన్యం సొమ్ము నేరుగా రైతుల ఖాతాల్లో జమయిందన్నారు. చిన్నచిన్న లోటుపాట్లు- ఉన్నా సరిదిద్దుకొని ముందడుగు వేయడం జరిగిందని, గౌరవ ముఖ్యమంత్రి కూడా ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. మార్చి 31న ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పూర్తయిన వెంటనే రబీ సీజన్‌కు సంబంధించి మొట్టమొదట నెల్లూరు జిల్లాపై దృష్టిసారించినట్లు తెలిపారు. గత రెండేళ్ల కాలంలో ఆ జిల్లా నుంచి ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదన్నారు. అక్కడి రైతులు, స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు తొలిసారిగా 1,30,000 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని.. ఖరీఫ్ నుంచి రబీకి వచ్చినందున ఇంకా కొనుగోళ్లు జరుగుతున్నాయని వివరించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర మేరకు మిల్లర్లు ధాన్యం సేకరించడం లేదని, అదేవిధంగా తరుగు పేరిట అధిక కోతలు విధిస్తున్నట్లు కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని, పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే మిల్లర్లపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని, ఏ ప్రభుత్వం చేయని విధంగా కూటమి ప్రభుత్వం రైస్ మిల్లర్లకు అండగా నిలిచిందని, గత ప్రభుత్వం వదిలివెళ్లిన రూ. 400 కోట్ల బకాయిలను కూడా చెల్లించడం జరిగిందన్నారు. రైతులు ఇబ్బందిపడేలా మిల్లర్లు వ్యవహరించొద్దన్నారు. ఎన్‌టీ-ఆర్, కృష్ణా జిల్లాల్లో లక్ష మెట్రిక్ టన్నులు అయినా రెండులక్షల మెట్రిక్ టన్నులు అయినా సేకరిస్తామని, రైతులు ఆందోళనతో తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. ఆర్ఎస్‌కే ద్వారా తమ ధాన్యాన్ని మద్దతు ధరకే అమ్ముకోవచ్చని.. ట్రక్ షీట్ ఆధారంగా 24 గంటల్లోపే ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో పడుతుందని మంత్రివర్యులు భరోసా కల్పించారు.ఎన్‌టీఆర్ జిల్లాకు సంబంధించి బుడమేరు వరదల కారణంగా నష్టపోయిన రైతులకు సంబంధించి దాళ్వా పంట ఆలస్య మైనందున ఈ-పంటలో నమోదైన ఖరీఫ్‌ని రబీలోకి వచ్చేలా వెసులుబాటు కల్పించాలని శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ విజ్ఞప్తి చేశారని.. ఈ మేరకు వెంటనే అధికారులను అప్రమత్తం చేసి ఆ మేరకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. రబీ కొనుగోళ్లు ప్రారంభమైనా అకాల వర్షాల వల్ల రైతులు కొంత ఇబ్బందికర పరిస్థితుల్లో తడిస్తే ధాన్యం పాడవుతుందనే ఉద్దేశంతో త్వరత్వరగా మిల్లులకు పంపించాలనుకోవడం.. దాన్ని ఆసరాగా చేసుకొని కొందరు మిల్లర్లు రైతులను ఇబ్బందిపెడుతున్నారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ నేపథ్యంలోనే మంత్రి క్షేత్రస్థాయిలో పర్యటించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, బుడమేరు వల్ల నష్టం వాటిల్లినా ఈసారి చాలా ఎక్కువ దిగుబడి వచ్చిందని, ప్రకృతి సహకరించిందని పేర్కొన్నారు. ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేయడం జరుగుతుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని శాసనసభ్యులు స్పష్టం చేశారు.

# మొదటి మ్యాచ్‌లో ఆకట్టుకున్న షేక్ రషీద్





చెన్నై సూపర్ కింగ్స్ 20 ఏళ్ల షేక్ రషీద్ కు అరంగేట్రం చేసే అవకాశం ఇచ్చింది. ఇప్పటి వరకు వరుస ఓటములతో బ్యాటింగ్ వైఫల్యంతో ఇబ్బంది పడుతున్న చెన్నైకు తురుపుముక్కలా దొరికాడు రషీద్. నిలకడైన, విధ్వంసకర ఓపెనింగ్ లేక చెన్నై ఇబ్బందిపడుతూ వచ్చింది. రషీద్ రావడం, కెప్టెన్సీ మార్పుతో జట్టులో కూడా చాలా ఛేంజ్ వచ్చింది. ఇన్నాళ్లు ఫ్యాన్స్ ఏది మిస్ అయ్యారో అది ఇప్పుడు జట్టులో కనిపిస్తోంది. తొలి మ్యాచ్‌లో షేక్ రషీద్ దుమ్మురేపాడు. చెన్నై విజయానికి కావాల్సిన రాబట్టడంలో లక్ష్యం దిశగా వెళ్లడానికి పునాది వేయడంలో కీలక పాత్ర పోషించాడు. రచిన్ రవీంద్రతో కలిసి చాలా కాలం తర్వాత చెన్నై జట్టు తరఫున మంచి భాగస్వామ్యం నెలకొల్పాడు. డిఫెన్సివ్ మోడ్‌లో ఆడుతున్న జట్టులో ఎదురు దాడితో ఇన్నింగ్స్ స్టార్ట్ చేశాడు. ఇప్పటి వరకు రకరక ప్రయోగాలు చేసిన చెన్నై జట్టు ఇప్పుడు అసలైన ఆటగాడికి అవకాశం ఇచ్చిందని ఫ్యాన్స్ అంటున్నారు. మొదటి మ్యాచ్‌లో ఓపెనింగ్ దిగిన షేక్ రషీద్... 19 బంతులు ఆడి 27 పరుగులు చేశారు. అతని స్ట్రైక్ రేట్ 142. ఇందులో ఆరు ఫోర్లు కొట్టాడు. చూడచక్కని ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. ఆవేష్ ఖాన్ బౌలింగ్‌లో షాట్‌కు ప్రయత్నించి నికోలస్ పూరన్‌కు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. ఫీల్డింగ్‌లో ఉన్నప్పుడు ఓ క్యాచ్ కూడా పట్టాడు. మంచి ఫీల్డింగ్‌తో ఆకట్టుకున్నాడు. షేక్ రషీద్ జీవిత కథ చాలా స్ఫూర్తిదాయకంగా ఉంది. ఈ యువ క్రికెటర్ పేదరికం, ఆర్థిక సమస్యలను ఎదుర్కొని %క్రూా% లోకి అడుగుపెట్టాడు. 24 సెప్టెంబర్ 2004న ఆంధ్రప్రదేశ్‌లోని గంటూరులో జన్మించాడు. తన ప్రొఫెషనల్ క్రికెట్ కెరీర్‌ను హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ నుంచి ప్రారంభించాడు. మొదటి సారిగా 2022 అండర్-19 ప్రపంచకప్‌నకు ఎంపికయ్యాడు. దీంతో తొలిసారి క్రీడా ప్రపంచానికి షేక్ రషీద్ పరిచయమయ్యాడు. రావడంతోనే జట్టు వైస్-కెప్టెన్‌గా ఎంపికవ్వడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. %జూు×ణ% కారణంగా రషీద్ టోర్నమెంట్‌లోని అన్ని మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. ఆడినకొన్ని మ్యాచ్‌లలో మాత్రం బౌలర్ల భరతంపట్టి వారికి చుక్కలు చూపించాడు. రషీద్ ప్రపంచ కప్‌లో నాలుగు మ్యాచ్‌ల్లో సగటున 50 కంటే ఎక్కువ పరుగులు సాధించాడు. అందులో 2 హాఫ్ సెంచరీ ఇన్నింగ్స్ కూడా ఉన్నాయి. షేక్ రషీద్ విజయంలో తండ్రి షేక్ బాలీషా ప్రధాన పాత్ర పోషించాడు. శిక్షణా కేంద్రం చాలా దూరంలో ఉన్నప్పటికీ రోజూ తీసుకెళ్లి తీసుకురావడం ఇష్టంగా చేశారు. చిన్న వయసులోనే క్రికెట్‌లో రాణిస్తున్న రషీద్‌ను చూసి తండ్రి తన కష్టాన్ని మర్చిపోయారు. రషీద్ క్రికెట్ కెరీర్‌లో రాణిస్తున్నటైంలో తండ్రి రెండుసార్లు తన ఉద్యోగాన్ని కోల్పోవలసి వచ్చింది. షేక్ రషీద్ 2023 %క్రూా% వేలంలో మొదటిసారి కనిపించాడు. %జూఖ% అతన్ని రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. కాని మ్యాచ్‌లు మాత్రం ఆడలేదు. 2025 మెగా వేలంలో చెన్నై సూపర్ కింగ్స్ అతన్ని మరోసారి కొనుగోలు చేసింది. ఇప్పటివరకు రషీద్ 19 మ్యాచ్‌ల ఫస్ట్-క్లాస్ కెరీర్‌లో 1,204 పరుగులు సాధించగా, తన %ు%20 కెరీర్‌లో ఒక సెంచరీ, ఒక అర్ధ సెంచరీతో సహా 352 పరుగులు చేశాడు.

## 11ఏళ్ల రికార్డ్ బ్రేక్ చేసిన ధోనీ




2025 ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ మళ్లీ విజయం రుచి చూసింది. వరుసగా ఐదు ఓటముల తర్వాత, సోమవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పైతో జరిగిన మ్యాచ్?లో చెన్నై నెగ్గింది. లఖ్?నవూ నిర్దేశించిన 167 పరుగుల టార్గెట్?ను చెన్నై 19.3 ఓవర్లలోనే 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ క్రమంలోనే సీఎస్కే కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ ఖాతాలో అరుదైన రికార్డు చేరింది. ఈ మ్యాచ్?లో 7వ స్థానంలో బ్యాటింగ్?కు దిగి ధనాధన్ ఇన్నింగ్స్?తో వింటేజ్ ధోనీని గుర్తుచేశాడు. 11 బంతుల్లోనే 26 పరుగులు (4 ఫోర్లు, 1 సిక్స్) తో ఔరా అనిపించాడు. అలా చెన్నై విజయంలో ధోనీ కీలక పాత్ర పోషించిన ధోనీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ లభించింది. ఈ క్రమంలోనే మహీ ఐపీఎల్‌లో 11 ఏళ్ల రికార్డును తిరగరాశాడు. ఐపీఎల్ చరిత్రలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న అతిపెద్ద వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. సోమవారం మ్యాచ్? నాటికి ధోనీ వయసు 43 సంవత్సరాల 280 రోజులు. ఈ క్రమంలోనే మాజీ ప్లేయర్ ప్రవీణ్ తాంబే రికార్డును బ్రేక్ చేశాడు. అతడు 2014 సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ, కోల్‌కతా నైట్‌రైడర్స్?పై మ్యాచ్?లో 42 సంవత్సరాల 208 రోజుల్లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డ్ గెలుచుకున్నాడు.కాగా, ఐపీఎల్?లో ధోనికి ఇది 18వ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు. 2175 రోజుల తర్వాత ధోనీ ఈ అవార్డు అందుకున్నునాడు. చివరిసారిగా ధోనీ 2019లో దిల్లీ క్యాపిటల్స్?తో మ్యాచ్?లో ఈ అవార్డు గెలుచుకున్నాడు.

## చెన్నై, సన్ రైజర్స్ జట్లలో మార్పులు

చెన్నై సూపర్ కింగ్స్ రెగ్యులర్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ స్థానంలో ముంబైకి చెందిన ఆయుష్ మాత్రేను జట్టులోకి తీసుకుంది. రాజస్థాన్ రాయల్స్ తో మ్యాచ్ సందర్భంగా కుడి మోచేయికి గాయం అయింది. ఆ తర్వాత రెండు మ్యాచ్ లు ఆడిన రుతురాజ్.. చిన్నపాటి ఫ్రాక్చర్ మోచేయిలో ఉందని తేలడంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. దీంతో కోల్ కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్ నుంచి ఎంఎస్ ధోనీ కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టాడు. ఈ మ్యాచ్ లో ఘోర పరాజయం పాలైన చెన్నై.. ఆ తర్వాత లక్నో సూపర్ జెయింట్స్ తో జరిగిన మ్యాచ్ లో అద్భుత విజయం సాధించింది. దీంతో వరుసగా ఐదు మ్యాచ్ ల్లో ఎదురైన పరజాయాల పరంపరకు అడ్డుకట్ట వేసింది. మాత్రేను రూ.30 లక్షలకు సీఎస్కే కొనుగోలు చేసింది. దేశవాళీల్లో 9 ఫస్ట్ క్లాస్ గేమ్ లు , 7 లిస్ట్ ఏ గేమ్ లను ముంబై ఆడాడు. ఓవరాల్ గా 962 పరుగులు సాధించాడు. రోహిత్ శర్మకు బిగ్ ఫ్యాన్ అయిన మాత్రే.. ఇక నుంచి ధోనీ కెప్టెన్సీ లో ఆడనున్నాడు. చెన్నై తర్వాతి మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ తో ఈనెల 20న ముంబైలో ఆడుతుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ కూడా తన జట్టులో ఒక మార్పు చేసింది. గాయం కారణంగా ఆడమ్ జంపా ఈ టోర్నీ మొత్తానికి దూరమయ్యాడు. ఈ సీజన్ లో కేవలం రెండు మ్యాచ్ లు ఆడి, అంతంతమాత్రంగానే రాణించాడు. జీషాన్ అన్సారీ స్పిన్నర్ గా రాణించడంతో జంపా దాదాపుగా పెవిలియన్ కే పరిమితమయ్యాడు. అతని స్థానంలో స్మరణ్ రవిచంద్రన్ ను ఎస్ఆర్ హెచ్ జట్టులోకి తీసుకుంది. తనను రూ.30 లక్షలతో ఒప్పందం చేసుకుంది. ఈ సీజన్ మొత్తానికి తను సన్ తో ఆడనున్నాడు. కర్ణాటకకు చెందిన స్మరణ్ రవిచంద్రన్.. దేశవాళీల్లో 7 ఫస్ట్ క్లాస్ గేమ్ లు, 10 లిస్ట్ ఏ మ్యాచ్ లు ఆడి 1100కు పైగా పరుగులు సాధించాడు. ఓవరాల్ గా స్పిన్నర్ స్థానంలో బ్యాటర్ ను ఎస్ఆర్ హెచ్ జట్టులోకి తీసుకున్నట్లయింది. ఇప్పటికే ఫియర్లెస్ బ్యాటింగ్ పవర్ తో నిండిన ఆరెంజ్ ఆర్మీలో స్మరణ్ కు అవకాశం దక్కడం కాస్త కష్టమేనని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇక ఈ సీజన్ లో ఎస్ఆర్ హెచ్ ఆరు మ్యాచ్ లు ఆడి రెండింటిలో మాత్రమే ఓడిపోయింది. ఇక నాలుగు మ్యాచ్ ల్లో పరాజయం పాలైంది. తన తర్వాతి మ్యాచ్ లో ముంబై ఇండియన్స్ తో ముంబైలో గురువారం ఆడనుంది.



## అక్షర్ పటేల్ పై రూ.12 లక్షల జరిమానా

ముంబై ఇండియన్స్ చేతిలో ఆదివారం జరిగిన మ్యాచ్ లో ఓడిపోయి నిరాశలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్ కు షాక్ తగిలింది. ఆ జట్టు కెప్టెన్ అక్షర్ పటేల్ పై రూ.12 లక్షల జరిమానాను బీసీసీఐ విధించింది. మ్యాచ్ లో స్లో ఓవర్ రేట్ మెయింటేన్ చేసినందుకుగాను, అతడిపై కొరడా ఝుళిపించింది. ఈ సీజన్ లో ఢిల్లీకిది తొలి తప్పే కాబట్టి, జరిమానాను విధిస్తున్నట్లు పేర్కొంది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ లోని ఆర్టికల్ 2.22ను అతిక్రమించినందుకుగాను ఢిల్లీ కెప్టెన్ కు ఈ శిక్ష పడింది. ఇక నాలుగు వరుస విజయాలతో జోరుమీదున్న ఢిల్లీకి ఒరిజినల్ సొంతగడ్డ అయిన ఢిల్లీ అరుణ్ జైట్లీ స్టేడియంలో బ్రేక్ పడింది. ఈమ్యాచ్ లో 12 పరుగుల తేడాతో ముంబై చేతిలో ఓడిపోయింది. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ముంబై నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లకు 205 పరుగులు చేసింది. తిలక్ వర్మ స్టన్నింగ్ ఫిఫ్టీ (59) తో సత్తా చాటాడు. విప్రజ్ నిగమ్, కుల్దీప్ యాదవ్ కు రెండేసి వికెట్లు దక్కాయి. అనంతరం ఛేజింగ్ లో ఢిల్లీ 19 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌట్ అయింది. కరుణ్ నాయర్ మెరుపు ఫిఫ్టీ (89) తో ఇంపాక్ట్ చూపించినా, జట్టును గెలిపించ లేక పోయాడు.. బౌలర్లలో కర్ణ్ శర్మకు 3 వికెట్లు దక్కాయి. మ్యాచ్ లో ఢిల్లీ ఛేదనలో 11 వ ఓవర్ తర్వాత బంతిని మార్చడంతో ముంబై లక్ మారింది. అప్పటివరకు ఓపికగా ఆడుతున్న కరుణ్ తోపాటు, అక్షర్, ట్రిస్టన్ స్టబ్స్, కేఎల్ రాహుల్ త్వరగా ఔటయ్యారు. దీంతో ఈ సీజన్ లో తొలి ఓటమిని ఢిల్లీ మూటగట్టుకుంది. నిజానికి ప్రత్యామ్నాయ సొంతగడ్డ అయిన విశాఖ పట్నంలో ఆడిన రెండు మ్యాచ్ లు గెలిచిన ఢిల్లీ.. అరుణ్ జైట్లీ స్టేడియంలో మాత్రం ఓడిపోయింది. ఇక ఈ మ్యాచ్ లో ఇంపాక్ట ప్లేయర్ గా బరిలోకి దిగిన కర్ణ్ శర్మ మూడు వికెట్లతో తన ప్రభావాన్ని చూపించాడు. మూడేళ్ల కిందట ఒక్కచాన్స్ అని అడిగి, తన టైం కోసం ఎదురు చూసిన కరుణ్.. ఈ మ్యాచ్ లో అవకాశం దక్కగానే రెండు చేతులతో ఒడిసి పట్టుకున్నాడు. ఫాఫ్ డుప్లెసిస్ స్థానంలో తుదిజట్టులో స్థానం దక్కించుకున్న కరుణ్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 40 బంతుల్లోనే 89 పరుగులు చేశాడు. 12 ఫోర్లు, 5 సిక్సర్లతో బౌండరీల వర్షం కురిపించాడు. ఈ ఇన్నింగ్స్ తో ఢిల్లీ జట్టులో తను రెగ్యులర్ సభ్యుడు అయిపోతాడనడంలో ఎలాంటి సందేహం లేదు. వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత టెస్టుల్లో ట్రిపుల్ సెంచరీ బాదిన ఏకైక భారతీయుడు కరుణ్ కావడం విశేషం. అయితే ఆ తర్వాత తనకు అవకాశాలు రాకపోవడంతో, దేశవాళీల్లో టన్నుల కొద్ది పరుగులు సాధించి, తాజాగా ఐపీఎల్ గడప మరోసారి తొక్కాడు. ఈ సీజన్ లో తనను రూ.50 లక్షలకే ఢిల్లీ సొంతం చేసుకోగా, తనకు దక్కిన దానికన్నా ఎన్నో రెట్ల విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. ముంబైతో మ్యాచ్ ఓడినా, కరుణ్ రూపంలో నిఖార్సైన బ్యాటర్ టాపార్డర్ లో దొరికాడనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక ఐపీఎల్లో సోమవారం లక్నోలో జరిగే మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ తో చెన్నై సూపర్ కింగ్స్ తలపడనుంది.



## పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో విరాట్ కోహ్లీ క్రేజ్

భారత దిగ్గట బ్యాటర్ విరాట్ కోహ్లీకి ప్రపంచవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. భారత్ గురించి తరచుగా చెడుగా మాట్లాడే పాకిస్తాన్ లాంటి దేశంలో కూడా విరాట్ కోహ్లీకి అభిమానులు ఉన్నారు. ఇండియాలో జరుగుతున్న ఐపీఎల్ 2025 లాగానే.. పాకిస్తాన్ సూపర్ లీగ్2025 పొరుగుదేశమైన పాకిస్తాన్‌లో ప్రస్తుతం జరుగుతోంది. పాకిస్తాన్ సూపర్ లీగ్‌లో భాగంగా సోమవారం రావల్పిండి క్రికెట్ స్టేడియంలో ఇస్లామాబాద్ యునైటెడ్, పెషావర్ జల్మి జట్ల మధ్య ఒక మ్యాచ్ జరిగింది. అక్కడ విరాట్ కోహ్లీ క్రేజ్ కనిపించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అభిమాని కూడా కనిపించాడు. ఆ అభిమాని ధరించిన జెర్సీపై విరాట్ కోహ్లీ ఐకానిక్ నంబర్ 18 అని రాసి ఉంది. ఈ అభిమాని ఫోటో వెంటనే సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ మ్యాచ్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్ జట్టు పెషావర్‌ను 102 పరుగుల తేడాతో ఓడించింది. ఈ సీజన్‌లో పాకిస్థాన్ సూపర్ లీగ్ మ్యాచ్ లో విరాట్ కోహ్లీ అభిమాని కనిపించడం ఇదే మొదటిసారి కాదు. శనివారం ముల్తాన్ సుల్తాన్స్, కరాచీ కింగ్స్ మధ్య మ్యాచ్ ప్రారంభానికి ముందు కరాచీలోని నేషనల్ స్టేడియం వెలుపల ఉన్న ఒక అభిమాని ఫోటో వైరల్ అయింది. అందులో ఆ వ్యక్తి విరాట్ కోహ్లీ పేరు, జెర్సీ నంబర్ 18 ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జెర్సీని ధరించి కనిపించాడు. విరాట్ కోహ్లీ గురించి చెప్పాలంటే.. ప్రస్తుతం ఐపీఎల్ 2025లో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం కోహ్లీ ఆర్సీబీ తరపున ఆడుతున్నాడు. ప్రతిసారీ లాగే ఈ సీజన్ లో కూడా విరాట్ కోహ్లీ బ్యాట్ నిప్పులు చెరుగుతోంది. విరాట్ కోహ్లీ ఇప్పటివరకు 6 మ్యాచ్ ల్లో 62 సగటుతో, 143 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్ తో 248 పరుగులు చేశాడు. ఇందులో మూడు అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఐపీఎల్ టోర్నమెంట్ లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో విరాట్ కోహ్లీ ఐదో స్థానంలో ఉన్నాడు. ఆర్సీబీ జట్టు విషయానికొస్తే ఆర్సీబీ 6 మ్యాచ్‌ల్లో నాలుగు విజయాలతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో ఉంది. ఈ సీజన్‌లో జట్టు అద్భుతమైన ప్రదర్శనకు విరాట్ కోహ్లీ ఫామ్ కూడా ఒక కారణం.



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem TV సామాన్యుడి ఆయుధంగా

# కథ కోసం నానా తంటాలు పడతా: నాగ్ అశ్విన్



'కల్కి'లో ప్రతి సన్నివేశా నికి బ్యాక్‌గ్రౌండ్‌లో ఎంతో వర్క్ చేశాం. తెరపై చూశాక అది ఫైటింగ్ సీన్ అంటారు. కానీ, దాని వెనక ఎంతో కష్టం ఉంటుందని దర్శకుడి గా తన అనుభవాల ను పంచుకున్నారు నాగ్ అశ్విన్. తాజాగా కాలేజ్ స్టూడెంట్స్‌తో ముచ్చటించిన ఆయన ఇండస్ట్రీలో తన అనుభవాలను పంచుకున్నారు. వారితో కొన్ని ఆసక్తికర విషయాలను చెప్పారు. చేసే పని ఏదైనా వందశాతం కష్టపడాలి. షార్ట్ ఫిల్మ్, సినిమా ఏదైనా ఇదే చివరిది అని భావించి తీయాలి. నేను బుక్స్ బాగా చదువుతాను. సినిమాల కంటే పుస్తకాలు మనపై ఎక్కువ ప్రభావాన్ని చూపుతాయి. పరిశ్రమలో కొనసాగాలంటే పుస్తకాలు చదవడం కూడా ముఖ్యమే. మనం అనుకున్న కథను ప్రేక్షకులకు అర్థం అయ్యేలా రాయగలగాలి. ఒక సామాన్య కథను కూడా ఆసక్తిగా రాయాలి. ఆ సినిమా వెనక నా ఒక్కడి కష్టం మాత్రమే లేదు. అది ఒక టీమ్ కష్టం. టీమ్‌లోని అందరి సలహాలు వింటాను. చిన్నప్పటి నుంచి మహాభారతం గురించి తెలుసు. దాని ఆధారంగా సినిమా తీయాలంటే కొంచెం భయపడ్డానని చెప్పారు. నేను కొన్ని ప్రాజెక్ట్‌లకు ఎడిటర్‌గా కూడా వర్క్ చేశాను. సినిమా బాగా రావడానికి ఎడిటింగ్ ప్రధానం. మొదట స్టోరీ రాసుకుంటాను. అందులోని పాత్రల ఆధారంగా నటీనటులను ఎంపిక చేసుకుంటాను. కల్కిలో పాత్రలు రాసిన తర్వాత మొదట అమితాబ్ బచ్చన్‌ను, తర్వాత ప్రభాస్‌ను సెలక్ట్ చేసుకున్నాను. ది నేను డైరెక్ట్ చేస్తే బాగుండేది అని ఏ సినిమాకు అనిపించలేదు. కానీ, 'ఖలేజా 'డియర్ కామ్రేడ్' సినిమాలను నేను ఎడిట్ చేసి ఉంటే బాగుండేది అనిపించింది. నాకు కామెడీ సినిమాలు అంటే ఇష్టం. ముఖ్యంగా జంధ్యాల సినిమాలు నచ్చుతాయి. నేను ఏదైనా రాసుకున్న తర్వాత రెండు నెలలకు అదే ఐడియా వేరే సినిమా -ట్రైలర్‌లో కనిపిస్తుంది. దీంతో దాన్ని పక్కన పెట్టాల్సి వస్తుంది. 2008లో ఒక కథ రాసుకున్నాను. జ్ఞాపకాలు, కలలు ఈ రెండు అంశాలతో రాశాను. ఇదే కాన్సెప్ట్‌తో వచ్చిన హాలీవుడ్ సినిమా 'ఇన్‌సెప్షన్' ట్రైలర్ చూశాక వారం రోజులు డిప్రెషన్‌లోకి వెళ్లాను. ఎంతో కష్టపడి కొత్తగా ఒక కథను రాస్తే గుర్తించే వారికంటే.. గతంలో వచ్చిన లవ్‌స్టోరీనే మరోసారి తెరకెక్కిస్తే దాని గురించి మాట్లాడేవారు ఎక్కువమంది ఉంటారు. అందుకే ఎప్పుడూ కొత్తగా రాసుకోవాలి. ఎక్కడా రాని పాయింట్ గురించి సినిమాలు తీయాలని అన్నారు.

## కథను నమ్మితే... ఇక రంగంలోకి దిగిపోతా




విజయ్ సేతుపతి హీరోగా దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ సినిమా రూపొందించనున్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాను ప్రకటించినప్పటి నుంచి రకరకాల కామెంట్స్ వినిపిస్తున్నాయి. పూరి ఫామ్‌లో లేరని ఆయన స్క్రిప్ట్‌ను ఎందుకు ఎంచుకున్నారంటూ విజయ్ సేతుపతిని ట్యాగ్ చేస్తూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా దీనిపై ఈ హీరో స్పందించారు. దీనికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. పూరి జగన్నాథ్‌తో నేను చేయనున్న సినిమా షూటింగ్ జూన్‌లో ప్రారంభం అవుతుంది. గతంలో వారు చేసిన సినిమాల ఫలితాల ఆధారంగా దర్శకులను జడ్జ్ చేయను. స్క్రిప్ట్ నచ్చితే సినిమా చేస్తాను. పూరి చెప్పిన కథ నాకు చాలా నచ్చింది. అందుకే అంగీకరించాను. ఇలాంటి కథ ఇప్పటివరకూ చేయలేదు. నేను ఎప్పుడూ కొత్త వాటికి ప్రాధాన్యం ఇస్తాను. గతంలో చేసిన స్టోరీలు రిపీట్ కాకుండా చూసుకుంటాను. ఈ సినిమాలో టబు ఓ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె గొప్ప నటి. టాలెంటెడ్ కోస్టార్. గతంలో ఎప్పుడూ ఆమెతో కలిసి స్క్రీన్ పంచుకోలేదు. ఈ సినిమాలో ఆమెతో కలిసి నటించడం ఆనందంగా ఉంది. విజయ్ సేతుపతి: నేను ఇప్పటివరకూ చేసిన చిత్రాల్లో 'మహారాజ' నాకు ప్రత్యేకమైనది. అందులోని పాత్ర కష్టమైనది. పిల్లలపై జరుగుతోన్న అఘాయిత్యాలకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వాటిలో నటించేటప్పుడు వణికిపోయాను. 'సూపర్ డీలక్స్, 'ఉప్పెన'లోని పాత్రలు కూడా కష్టమైనవే. కానీ 'మహారాజ' నా హృదయాన్ని హత్తుకుంది. ఎందుకంటే నేను నిజజీవితంలోనూ ఒక కుమార్తెకు తండ్రినే కదా. నేను బలమైన సందేశం ఉన్న సినిమాలు ఎంచుకుంటాను. అదే నా బలం. పూర్తిగా వినోదాత్మక చిత్రాలలో నటించకూడదని కాదు.. వినోదంతో పాటు సందేశం కూడా ఉండాలి. పూరి సినిమాతో పాటు-మరో రెండు తమిళ ప్రాజెక్ట్‌లు చేస్తున్నాను. మిస్కిన్ దర్శకత్వంలో 'ట్రైన్' చిత్రంలో నటిస్తున్నాను. ఇది యాక్షన్ చిత్రం. దీనితో పాటు మరో మర్డర్ మిస్టరీలో నటిస్తున్నాను.

## గుడ్ బ్యాడ్ అగ్లీలో ఇళయారాజా పాటలు రీమిక్స్

టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు ప్రముఖ సంగీత దర్శకులు ఇళయరాజా నోటీసులు పంపారు. తెలుగులో అగ్రగామి సంస్థగా సినిమాలు రూపొందిస్తున్న మైత్రీ మూవీ మేకర్స్ గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాతో తమిళ సినిమా పరిశ్రమలో అడుగుపెట్టింది. కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ హీరోగా యంగ్ డైరెక్టర్ ఆదిక్ దర్శకత్వంలో భారీ బడ్జెట్ పై ఏఇ÷ఖ సినిమాను నిర్మించారు. ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయిన ఈ సినిమా బ్లాక్ బెస్టర్ హిట్ టాక్ తెచ్చుకుని రికార్డ్ స్థాయి కలెక్షన్స్ రాబడుతోంది.అయితే ఈ సినిమాలో కొన్ని సీన్స్ లో ఒకప్పటి తమిళ్ సినిమాలలోని ఇళయరాజా సంగీతం అందించిన సాంగ్స్ ను గుడ్ బ్యాడ్ అగ్లీలో వారిని రీమిక్స్ చేసి ఉపయోగించారు. ఆ సదరు సీన్స్ థియేటర్స్ లో ఫ్యాన్స్ ఆ సాంగ్స్ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. అందుకు సంబందించి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. అయితే తన పాటను అనధికారికంగా వాడుకోవటం పై ఇళయరాజా ఆగ్రహం వ్యక్తం చేసారు. సినిమాలో తన పాటలు వాడడం పై నోటీ-సులు ఇచ్చారు ఇళయరాజా. నష్టపరిహారం కింద తనకు ఐదు కోట్ల రూపాయలు చెల్లించాలంటూ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ కు నోటీ-సులు పంపారు ఇళయరాజా. అదే విధంగా గుడ్ బ్యాడ్ అగ్లీలోని మూడు పాటలను వెంటనే నిలిపివేయాలని మరియు 7 రోజుల్లోగా చిత్ర బృందం బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఇళయరాజా డిమాండ్ చేసారు. మరి ఇప్పుడు మైత్రి మూవీ మేకర్స్ ఈ నోటిసులపై ఎలా స్పందిస్తారో చూడాలి.



## అమీర్‌ను డైరెక్ట్ చేయనున్న వంశీపైడిపల్లి

కొంతకాలంగా వంశీ పైడిపల్లి బాలీవుడ్ ఎంటర్‌పై దృష్టి సారించాడు. అమీర్ ఖాన్ హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించే క్రమంలో ఆయనకు స్టోరీ లైన్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే తమిళనాడులో విజయ్‌తో ఓ సినిమాచేసిన వంశీ పైడిపల్లి ఇప్పడు హిందీలోకి అడుగు పెట్టాలని చూస్తున్నారు.దిల్ రాజు ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టు-గా చెబుతున్నారు. ఇటీవల ఆయన ప్రొడ్యూస్ చేసిన పాన్ ఇండియా లెవెల్‌లో మరో క్రేజీ ప్రాజెక్టు పట్టాలెక్కేలా కనిపిస్తోంది. బాలీవుడ్ సూపర్‌స్టార్ ఆమిర్ ఖాన్ , టాలీవుడ్ డైరెక్టర్ వంశీ పైడిపల్లితో సినిమా వర్కవుట్ అయ్యేలా ఉందన్న టాక్ వినిపిస్తోంది. టాలీవుడ్ వర్గాల్లో వినిపిస్తున్న న్యూస్ ప్రకారం.. వంశీ చెప్పిన సింగిల్-లైన్ ప్లాట్ ఆమిర్‌ని ఫిదా చేసిందట. దీంతో పూర్తి స్క్రిప్ట్ కోసం ఆమిర్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నాడని తెలుస్తోంది. వంశీ తన రైటర్స్ టీమ్‌తో స్క్రిప్ట్‌ని డెవలప్ చేస్తున్న స్టైల్ ఆమిర్‌కి బాగా నచ్చిందట. స్క్రిప్ట్ రెడీ అయిన వెంటనే మేకర్స్ ఆయనకు చెప్పబోతున్నట్టుగా తెలుస్తోంది. కొంతకాలంగా వంశీ పైడిపల్లితో పాన్ ఇండియా ట్రావెల్ చేస్తున్న దిల్ రాజు నే ఈ సినిమాకు కూడా నిర్మాతగా వ్యవహరించబోతున్నట్టుగా చెబుతున్నారు.

## విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా రామరామ సాంగ్

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి కాంపౌండ్ నుంచి వస్తోన్న సోషియో ఫాంటసీ ప్రాజెక్ట్ విశ్వంభర బింబిసార ఫేం వశిష్ఠ మల్లిడి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీలో త్రిష ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. అమిగోస్ ఫేం ఆషికా రంగనాథ్, రమ్య పసుపులేటి, సురభి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నండూరి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కాగా ఇటీవలే ఈ మూవీ నుంచి ఫస్ట్ సింగిల్ రమ రామను విడుదల చేశారని తెలిసిందే. ఈ పాటకు మ్యూజిక్ లవర్స్ నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ పాట యూట్యూబ్‌లో నంబర్ 1 ప్లేస్‌లో -టె-ండింగ్ అవుతోంది. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటను ఎంఎం కీరవాణి కంపోజ్ చేయగా.. శంకర్ మహదేవన్, ఐరా ఉడుపి, లిప్సికా భాష్యం పాడారు. రామ రామ సాంగ్ విశ్వంభరకు స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదని తాజా వార్త చెప్పకనే చెబుతోంది. ఈ మూవీని యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ తెరకెక్కిస్తుండగా.. ఇప్పటికే రిలీజ్ చేసిన విశ్వంభర -టైటిల్ లుక్, కాన్సెప్ట్ వీడియో మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ సినిమాపై సూపర్ హైప్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రాన్ని మే 9న విడుదల చేయనుండగా.. మేకర్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది.

## కొత్త చిత్రాలతో సందడి

**న్యూ ఇయర్ సందర్భంగా పలు ప్రాజెక్టులు**

ఉగాదితో తెలుగువారందరికీ కొత్త సంవత్సరం ప్రారంభమైనట్టు- కేరళ, తమిళనాడు ప్రాంత వాసులకు ఏప్రిల్ 14తో నూతన సంవత్సరం మొదలైంది. ఈ విషును తారలంతా ఘనంగా సెలబ్రేట్ చేసారు. ఈ సందర్భంగా కోలీవుడ్, మాలీవుడ్ హీరోలు తమ రాబోయే చిత్రాలకు సంబంధించి అప్ డేట్స్ షేర్ చేసుకున్నారు. అమరన్ తో సూపర్ హిట్ కొట్టిన శివ కార్తికేయన్ తాజాగా మురుగదాస్ డైరెక్షన్ లో చేస్తున్నసినిమా మదరాసి రిలీజ్ డేట్ కన్ఫర్మ్ చేసింది యూనిట్. సెప్టెంబర్ 5కే థియేటర్లలో బొమ్మ రాబోతుంది.మాలీవుడ్ స్టార్ యాక్టర్.. నివిన్ పాలీ విషు సందర్భంగా ఓ సినిమాను స్టార్ట్ చేశాడు. బేబీ గర్ల్ అనే మూవీకి ఏప్రిల్ 14న కొబ్బరి కాయ కొట్టారు. ఫస్ట్ కుంచికో బొబన్ హీరోగా అనుకుంటే ఆయనకున్న కమిట్‌మెంట్స్ వల్ల డేట్ అడ్జస్ట్ చేయలేకపోవడంతో ఇప్పడు ఈ ప్రాజెక్ట్ నివిన్ చెంతకు చేరింది. 2023లో మలయాళంలో వచ్చిన గరుడన్ ఫేం అరుణ్ వర్మ ఈ చిత్రానికి దర్శకుడు. ఫహాద్ ఫజిల్, కళ్యాణీ ప్రియదర్శన్ జంటగా నటిస్తోన్న మూవీ ఒదుం కుతిరా చదూం కుతిరా ఫస్ట్ లుక్ పోస్టర్ విషు సందర్భంగా రిలీజ్ చేశారు. రొమాంటిక్ కామెడీ జోనర్‌లో క్రేజీ వెడ్డింగ్ స్టోరీగా తెరకెక్కిస్తున్నాడు డైరెక్టర్ అల్తాఫ్ సలీమ్. అలాగే తెలుగులో ఈగ తరహాలో మలయాళంలో ÷-లపైతో సరికొత్త ప్రయోగం చేస్తున్నారు. లవ్లీ అనే -టైటిల్‌తో తెరకెక్కుతోన్న మూవీ నయా అప్డేట్ వచ్చింది. ఈ సినిమాను గతంలో ఏప్రిల్ 4న విడుదల చేయాలనుకోగా ఇప్పడు మే 4కు పోస్ట్ పోన్ అయిందని తెలుపుతూ పోస్టర్ రిలీజ్ చేసారు. మొత్తానికి పండగ కానుకగా సినిమాల విశేషాలను ప్రేక్షకులతో షేర్ చేసుకున్నారు మేకర్స్.

